సంపుటి 12 సంచిక 1 నవంబర్ - డిశంబర్ 2023

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org
Vol-12 Issue-1
వెల : రూ. 20/-





















'హనీబీ' ప్రేరణ గొలిపే కథలు

# ఇంకెప్పటికి తెలుసుకొంటాం మనం?
## (విఫలమైన నక్క కథ)




(మూలం : 2001లో బెర్లిన్ లో జరిగిన అంతర్జాతీయ సాహిత్య సంబరాల్లో 'శ్రీ తాజిమా షింజి'చే ప్రస్తుతింపబడినది. హనీబీ కై ఆంగ్ల అనువాదం : 'టామోనీ కసోనే')

పూర్వం 'కొంకిచి' అనే నక్క ఒకటుండేది. అది మంచు పడే శీతాకాలం. కానీ ఇంకా వెచ్చని వసంత కాలపు గాలులు వీచక ముందే 'కొంకిచి' శరీరం కొంకర్లు పోయే చల్లని గాలుల నుంచి రక్షణగా వెచ్చగా ఉండటానికని తవ్వుకొన్న కలుగు లోంచి బయటకొచ్చింది. చిన్ని కొంకిచి తీవ్రంగా ఆలోచిస్తోంది. గత సంవత్సరం వసంత కాలంలో తాముండే గుట్టలని తవ్వి చదును చేసి, మనుష్యులు 'గోల్ఫ్' ఆడటానికని ఏర్పాటు చేసుకొని విలాసవంతంగా గోల్ఫ్ బ్యాట్లను తిప్పుకుంటూ గోల్ఫ్ ఆడుకుంటూ జీవించటం గమనించినప్పటినుంచి ఆలోచిస్తూనే ఉంది. వారు మహారాజుల్లా తింటూ సుఖంగా విశ్రాంతి తీసుకోవటం గమనించింది. రోజూ కష్టపడి తిండి సంపాదించుకునే తన నక్క బ్రతుకు కన్న మనుష్య జన్మ చాలా మేలని బావించింది.

తన తల్లి ఎంత చెబుతున్నా వినకుండా మంత్రం ఉచ్చరించి మనిషిగా మారిపోయింది. చాలా లాభదాయకమైన వ్యాపారిగా మారటానికి శరీరాన్ని వెచ్చగా ఉండే బొచ్చు వస్త్రాలు చేసే కంపెనీలో పనికి చేరింది. తను కూడా కష్టపడి సంపాదించి కొండల్లో ఉన్న తన తల్లికి మంచి బహుమతులు తీసుకొని వెళ్ళాలని ఆశ పడింది. కాని ఒకరోజు ఒక విషాదం జరిగింది. కొత్తగా తయారైన బొచ్చుతో చేసిన కొత్త కోటు వాసన తెలిసినట్లనిపించింది. అవును అది తన తల్లి చర్మంతో చేసిన కోటే!? తన తల్లి ఈ విధంగా మనుషులు వినియోగించి 'కోటు'గా మారిపోయింది!

(ఆ తర్వాత 'కొంకిచి' ఏమైందో ఎవ్వరికీ తెలీదు. తను ఎప్పటికీ నక్కగా మారిపోలేదు, తిరిగి అడవికి వెళ్ళలేదు....

ఇలాంటి 'కొంకిచీలు' మన మధ్యలోనే ఉన్నారని మీకనిపించటం లేదా?)

- హనీబీ (34(2), ఏప్రిల్ - జూన్ 2023.

సంపుటి-12 సంచిక - 1 నవంబర్ - డిశంబర్ 2023

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-40253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**డా. కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 200/-**
**for 1 year Subscription**

## ఈ సంచికలో.....

* 'సృష్టి', అహమ్మదాబాద్ వారు నిర్వహించిన 47వ 'శోధయాత్ర' - 4
* ఎండు గడ్డిని చిన్న ముక్కలుగా చేసే యంత్రం చేసిన 'జలీల్' - 8
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 10
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 13
* 'జి-20' 'సి-20' 'లైఫ్' అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశ సమ్మతులు - 18
* రైతు అవసరాలకు స్పందించిన ఇన్నోవేటర్ కొడిముంజ ప్రవీణ్ కుమార్ - 19
* పల్లె జ్ఞానం - 22
* మహిళల ముఖాలపై ఆనంద 'పద్మా'లను వికసింపజేసిన ఇన్నోవేటర్ 'పద్మశ్రీ' అరుణాచలం మురుగనాథమ్ - 24
* రసాయన ఎరువులు నేరుగా మొక్కకు అందించే పరికరం - తల్లి కష్టాన్ని తగ్గించిన శశిధర్ - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 29
* స్పందన - 31

**కవర్ లోపలి పేజీల్లో ...**

"ఇంకెప్పటికి తెలుసుకొంటాం మనం?" - 'హనీబీ' ప్రేరణ గొలిపే కథ
రైతుల కొరకు రైతులు తయారు చేసిన ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**

నవంబర్ - డిశంబర్ 2023 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. -500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank,
Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు ప్రజలకు చేరటం ఎలా?

సామాన్యప్రజల్లో జ్ఞానం ఉందన్న ప్రగాఢ విశ్వాసంతో 2005లో 'పల్లెసృజన' ప్రయాణం ప్రారంభం అయింది. తెలుగు రాష్ట్రాలలో విస్తారంగా గ్రామాలను సందర్శించి, గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను వెతకడం పల్లెసృజన కార్యక్రమాల్లో అతి ప్రధానమైనది. జ్ఞానం పల్లెల్లో ఉంది. కాని జ్ఞానానికి కాళ్ళు లేవు. మనకున్నాయి కాబట్టి మనమే జ్ఞానం వద్దకు నడవాలన్న నమ్మకంతో తెలుగు రాష్ట్రాలలోని పల్లెల వైపు పయనమైంది. పల్లెసృజన స్వచ్ఛంద సంస్థ కనుక ఆర్థిక సౌష్టవం లేని కారణంగా గమనం మందకొడిగా సాగినా ఈ జ్ఞాన శోధ యాత్రలు ఎంతో ప్రయోజనకరంగా జరిగాయి. 18 సంవత్సరాల పయనంలో 500కు పైగా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను పల్లెసృజన వాలంటీర్లు గ్రంథస్థం చేయగలిగారు. పల్లె జ్ఞానాన్ని శోధించే కార్యక్రమం పల్లెసృజనలో నిరంతరం జరుగుతునే ఉంటుంది. గత 5 సంవత్సరాలుగా పరిష్కారాల శోధనే కాకుండా, సమస్యలను సమాజం నుండి ఆహ్వానించి, వాటికి పరిష్కారాలను కనుగొనటానికి గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు ప్రోత్సాహం, మార్గదర్శకత్వం చేస్తుంది పల్లెసృజన. ఈవిధంగా కూడా 20 దాకా గ్రాస్‌రూట్స్ పరిష్కారాలు వెలుగులోకి వచ్చాయి.

జ్ఞానాన్ని వెతకడం ఒకవంతు అయితే, దాన్ని గ్రంథస్తం చేయడం మరోయెత్తు. ఇది చాలా కష్టతరమైన పని. పల్లెసృజన వాలంటీర్ల నిష్ఠ, వారి తపన, స్వచ్ఛంద సేవాభావం గ్రంథీకరణకు ఒక స్థాయినిచ్చి, సమాజ ప్రయోజనానికి తోడ్పడింది. ఈ ఇన్నోవేటర్లను ప్రపంచానికి పరిచయం చేయడానికి వారి ఇన్నోవేషన్ల గ్రంథీకరణ ముఖ్యమైన అంశం. వాలంటీర్ల భావ ప్రకటనా నైపుణ్యం, వీరికి జాతీయ, అంతర్జాతీయ, స్థానిక గుర్తింపు రావడానికి ముఖ్య కారణమైంది. ఈ గుర్తింపులు, అవార్డులు, గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ ఉద్యమానికి ఊపునివ్వడమే కాకుండా, వందలాది సృజనాత్మక గ్రామస్తులను తట్టి లేపింది. వందలాది గ్రామస్తులు తమ సమస్యలకు తామే పరిష్కారాలు వెతకడం ప్రారంభించారు. చాలావరకు సఫలమయ్యారు కూడా.

జ్ఞానాన్ని గ్రంథస్థం చేసిన తర్వాత ఇన్నోవేషన్‌ను ముందుకు తీసుకుపోవడాన్ని "నర్చరింగ్" అంటాం. ఇందులో భాగంగా 'నమూనా' (ప్రోటోటైప్) తయారు చేయడం, దాన్ని పరీక్షించడం, లబ్ధిదారులతో దాన్ని ఉపయోగించి, వారి అభిప్రాయాలు సేకరించి, ఇన్నోవేషన్‌కు అవసరమైన మార్పులు చేయించడం, అన్ని విధాలా వారికి సంపూర్తిగా, సంతృప్తినిచ్చేలా చేయడం, పేటెంటు కై ప్రయత్నాలు చేయడం, ఆర్థిక సహాయానికి తగిన పద్ధతులను వెతికి దరఖాస్తు చేయడం..... లాంటి పనులు పల్లెసృజన వాలంటీర్లు చేస్తారు. కొంతవరకు ఇన్నోవేషన్ల ప్రగతిలో ఈ స్థాయి కూడా ప్రధానంగా వాలంటీర్ల సహాయంతోనే ముందుకు సాగడం సాధ్యమౌతుంది. అటల్ ఇన్నోవేషన్ మిషన్ చొరవతో ఈ స్థాయిని మరింత త్వరితంగా పెద్దయెత్తులో చేసే అవకాన్ని పల్లెసృజన శోధిస్తోంది.



ప్రతి ఇన్నోవేషన్ సమాజంలోని ఒక "బాధ" తగ్గించడానికే తయారవుతుంది అన్నది పల్లెసృజన నమ్మకం. ఇక్కడ బాధ నివారణ అంటే..... సమయం మిగలడం, కష్టం తగ్గడం, ఖర్చు మిగలడం, పని బాగా జరగడం లాంటివి. ఇవన్నీ లబ్ధిదారులైన గ్రామస్తులకు బాధలు తగ్గించి కొంత ఆనందాన్ని తప్పకుండా కలుగజేస్తాయి. ఇలాంటి ఇన్నోవేషన్‌లను సమాజంలో అవసరమైన వారికి చేర్చడం చాలా ప్రధానం. అయితే ఈ చేర్చే ప్రక్రియలో ఖచ్చితంగా నిర్ధారించని ప్రమాణాలు, నిర్దిష్టమైన వితరణ పద్ధతులు వ్యవస్థలో లేకపోవటం, సమాజంలో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లపై అవగాహనా లేమి, "స్వేచ్ఛా మార్కెట్"లో ఉన్న ఒడిదుడుకులు లాంటి చాలా అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఫలితంగా అద్భుతమైన పరిష్కారాలు ఉన్నా అవి లబ్ధిదారులకు అందటం లేదు.

పల్లెసృజన చేసే ఇన్నోవేషన్ల ప్రదర్శనలు, వెబినార్లు, పల్లెసృజన పత్రికా ముఖంగా జరిగే ఇన్నోవేషన్ల వ్యాప్తి, సోషల్ మీడియా ఉపయోగం - ఇలాంటివన్నీ కొంత వరకు మాత్రమే ప్రజల్లోకి ఈ ఇన్నోవేషన్లను తీసుకు వెళ్ళగలిగాయి. ప్రజలకు ఈ ఇన్నోవేషన్లు కావాలి. ఎన్.ఐ.ఎఫ్. లాంటి జాతీయ స్థాయి సంస్థలు కూడా ఈ ఇన్నోవేషన్ల విస్తరణ విషయంలో అనుకున్నంత సఫలం కావటం లేదు. పల్లెసృజన కూడా ఈ విస్తరణను చేయదలుచుకున్న స్థాయిలో చేయలేకపోతోంది.

ఇన్నోవేషన్లు ఉన్నాయి, ప్రజలకు కావాలి, ఇవన్నీ సామాన్య ప్రజల "తీరని అవసరాలను" తీరుస్తాయి. వారి ఖర్చును, కష్టాన్ని, సమయాన్ని తగ్గించి, వారి అభివృద్ధికి, వారి అవసరాన్ని తీర్చడానికి తోడ్పడతాయి. గ్రామస్తులకు అందుబాటులో ఉంటాయి. సబ్సిడీల అవసరం ఉండదు. ప్రస్తుత పద్ధతిలో ఈ ఇన్నోవేషన్లు లబ్ధిదారులకు చేరడం కష్టతరమౌతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా పల్లెసృజన చర్చల ద్వారా ఒక నూతన పంథాను తయారు చేసింది.

"తీరని అవసరాలను" తీర్చడం ప్రభుత్వాల బాధ్యత. గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు ఈ కోవలో ఉంటాయి. కాబట్టి వీటిని విస్తరింపజేయడం, లబ్ధిదారులకు చేరేలా చేయడం ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకోవాలి. 80 కోట్ల ప్రజలకు ఏవిధంగా గత మూడు సంవత్సరాలుగా ఉచితంగా ఆహార వస్తువులు పంచుతున్నారో, అదేవిధంగా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను ప్రజలకు తీరని అవసరాలను తీర్చేలాగా, విస్తరణ చేయడానికి ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్థానిక ప్రభుత్వ వ్యవస్థలు, బ్యాంకులు, సియస్ఆర్ ద్వారా ప్రైవేట్ సంస్థలు, పౌర సమాజ సేవా సంస్థలు, దేశ విదేశాల్లోని ఛారిటీ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి, స్థానిక ప్రభుత్వాలు అత్యంత ఉపయోగకరమైన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను ప్రతి లబ్ధిదారునికి అతి తక్కువ సమయంలో విస్తరింపజేయాలి. ఈ పద్ధతిలో ప్రధానమైన పాత్ర ప్రభుత్వానిది. అన్ని వనరులను, పాలసీలను, తెలివిగా ఉపయోగించడమే ప్రభుత్వాలు చేయవలసింది. ఒక సమన్వయకర్తగా వ్యవహరించాలి. కాలపరిమితి నిర్ణయించి, ఆ పరిమితిలోనే ప్రజలకు ఈ ఇన్నోవేషన్లు చేర్చగలిగితే సమాజంలో ఆనందాన్ని, అభివృద్ధిని, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడును కల్పిస్తుందన్న విశ్వాసం 'పల్లెసృజన'కు ఉంది.

పై పద్ధతిలో ఇన్నోవేషన్లకు డిమాండు పెరుగుతుంది. వాటిని సరియైన సమయానికి, సరియైన ధర, నాణ్యతతో సరఫరా చేయడానికి కావలసిన 'సామర్థ్యత' 'నిర్మాణం' కూడా ప్రభుత్వం చేపట్టాలి. పిఎంఇజిపి, ముద్ర, స్టార్టప్, నాబార్డ్, యస్ఐడిబిఐ, ఎంపి లాడ్స్, సిఎస్ఆర్ లాంటి ఎన్నో పథకాలను దీనికనువుగా వాడుకోవాలి.

పైన సూచించిన విస్తరణ పద్ధతి తెలంగాణ ప్రభుత్వం టిఎస్ఐసి ద్వారా ఒక పైలట్‌గా చేయడానికి ముందుకు వచ్చింది. వీరి ప్రయత్నం విజయవంతమై తెలంగాణ ప్రజల ఆనందం వృద్ధి అవుతుందని మనసారా ఆశిద్దాం. ఈ విషయంలో మీ అభిప్రాయాలను స్వాగతిస్తున్నాం.

2023లో 'జి-20' దేశాల కూటమికి భారత దేశం అధ్యక్షత వహించిన విషయం అందరికీ విదితమే. ఈ సందర్భంగా 'పల్లెసృజన' జి-20' సి-20' 'లైఫ్' వర్కింగ్ గ్రూపులో భాగంగా "గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు - లైఫ్‌స్టైల్" అంశంపై అంతర్జాతీయ సమావేశాలు నిర్వహించింది. 'సి-20' శిఖరాగ్ర సమావేశం జులై 2023లో జరిగింది. కూటమిలోని అన్ని దేశాలు ఒప్పుకున్న సంగతులను తెలుగులోకి అనువదించి ఈ సంచిక నుంచి ధారావాహికంగా పాఠకులకు అవగతం చేస్తున్నాం.

తెలుగు ఇన్నోవేటర్లు గత రెండు నెలల్లో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలతో సత్కరించ బడ్డారు. ఇది మనందరికీ ఎంతో ఆనందాన్ని కలిగించే విషయం.

నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు. ఆనందంగా సంక్రాంతి పండుగ సంబరాలు జరుపుకుంటారని మనసారా ఆశిస్తూ.....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# 'సృష్టి', అహమ్మదాబాద్ వారి 47వ శోధయాత్ర
# తమిళనాడు లోని రామనాథపురం మజిలీ ప్రాంతం నుండి తీర ప్రాంతం దాకా



స్వేచ్ఛానువాదం
- జమ్మలమడక శశిమోహన్

**తమిళ సంఘం వంజ్మయంలో 'బాలంబాల్' తన రచనలో 5 ప్రాంతాలను ప్రస్తావించారు, పాలయి (ఎడారి ప్రాంతం), మూలై (అడవులు పరిసర ప్రాంతాలు), మారుతం (పంట ప్రదేశాలు), నేతల్ (సముద్ర తీర ప్రాంతం) కురుంజీ (పర్వతాలు, గుట్టల ప్రాంతం.**

మేము జరిపిన అనేక శోధయాత్రలతో పోలిస్తే, ఈ యాత్రలో చూసినటువంటి వైవిధ్యమైన ప్రదేశాలను, ప్రజలను ఎక్కడా చూడలేదు. ఇక్కడి జాలరులు చాలా ఉపయోగకరమైన ఇన్నోవేషన్‌లు చేసుకొన్నారు. ఒకదానిలో కేవలం ఒక బకెటు, ఒక ప్లాస్టిక్ సంచీ, కొన్ని రాళ్ళు ఉపయోగించబడ్డాయి. ఈ పద్ధతిలో వీళ్ళకి దొరికే చేపలు తక్కువే అయినా ఆధునిక పరికరాలు ఉపయోగించి చేపల జనాభాను ప్రమాదంలో పడేయటం మాకిష్టం లేదని వారు చెప్పారు. సముద్ర నాచును పెంచి దానిని ఆధారంగా ఎరువులు, ఔషధాలు, పిల్లల బొమ్మలకి రంగులు మొదలైనవి తయారు చేస్తారు. తాటి ఆకులు, పళ్లతో చిన్నపిల్లల బొమ్మలను చేస్తారు. అంతేకాక ఆహారం, ఔషధాలు, కళలు, వాస్తు శిల్ప కళలు, చేయటానికి వీటిని విరివిగా వాడతారు.

మేము 60 మంది యాత్రీకులం ఈ యాత్రలో రామనాథ పురం వాసులు ప్రకృతిని, తమ ఆరోగ్యాన్ని, సంస్కృతిని స్వచ్ఛందంగా కాపాడు కుంటూ రావటం గమనించాం. హనీబీ నెట్‌వర్క్ 'ధాన్' ఫౌండేషన్ వాలంటీర్లు, 'సేవ', 'గ్యాన్', 'కుకొ అటవీ పాఠశాల' మొదలైన స్వచ్ఛంద సంస్థల వారు ఈ శోధ యాత్ర ఏర్పాటు చేశారు.

**పశువుల పెంపకం :** రామనాథపురం ప్రజలు తమ పశువుల పెంపకంలో సంస్కృతిని, మూలాలని మరచిపోలేదు. మేము ఒక గ్రామం ప్రవేశించేటప్పుడు అక్కడ ఒక చెట్టు కొమ్మలకి గ్రామస్తులు గోవు మావి ఉన్న ప్లాస్టిక్ సంచిలో కట్టడం గమనించాం. ఎందుకని అడిగితే దుష్ట శక్తుల నుంచి కొత్తగా పుట్టిన దూడలకు రక్షణ కలిగి ఆరోగ్యంగా పుడతాయని వాళ్ళ నమ్మకం. 'పిరప్పెన్ వల్‌సాల్' అనే గ్రామంలో కుమారా అనే గొర్రెల కాపరి తన గొర్రెలని కన్న బిడ్డల్లా చూసుకుంటాడు. తన పిల్లలకి గొర్రె పాలే తాగిస్తాడు. తన గొర్రెలని ముందే అమ్మితే రూ. 5000 వరకు వస్తాయి. కానీ ఆయన వాటిని 7 సంవత్సరాల వరకు పెంచి ఇక పాలు ఇవ్వవు అని తేలిన తరువాత 3000 రూపాయలకే అమ్మేస్తాడట. అతనివద్ద కిడాయి ముత్తు అంటె గొర్రెల పోతులకి పనికి వచ్చే పుత్రిక జాతి గొర్రెలున్నాయి. వాటిని రూ. 13 వేల వరకు అమ్ముతాడు. 'సేవా, హనీబీ' సంఘంలో చాలా కాలం నుంచి ఉంటున్న శకుంతల అనే శోధయాత్రి మేకలకి, గొర్రెలకి చిన్న చిన్న రోగాలొస్తే చికిత్స చెయ్యటానికి పశువుల డాక్టర్ వద్దకు వెళ్ళే అవసరం లేకుండా వారికి ఎన్నో వైద్య చిట్కాలు చెప్పారు.









మధురై లోని ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సభ్యుడైన పి. కబిలన్ తన సంఘంలో 750కి పైగా సభ్యులున్నారనీ, వారంతా పుల్లికుల్లం అనే ప్రత్యేక జాతి గొర్రెలని పెంచుతారనీ, తమ ప్రమేయంతో నర్సరీల్లో చెట్లు పెంచడానికి, చిన్న సీడ్ పాడ్స్ (చిన్న కుండీలు) తయారు చేస్తామని చెప్పాడు. దాని ద్వారా విత్తనాలకి ఆదనపు పోషకాలు అంది మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతాయట. తమ సంస్థ స్వచ్ఛమైన పాలు సరఫరా చెయ్యటమే కాక, వట్టిపోయిన పశువులను కూడా సంరక్షిస్తుంది అన్నాడు.

ఈ ప్రాంతంలో పశువులు, మేకలు, గొర్రెలు బాగా ఉన్నాయి. గొర్రెలకన్నా మేకలను పెంచటం సులభమని చెప్తారు. ఒక రైతు తన గొర్రెలకి ఎత్తులో ఉన్న కొమ్మల ఆకులని తినేలా శిక్షణ యిస్తున్నాడు. ఎవరి ఇళ్ళలో వారు కోళ్ళను బాగా పెంచుకుంటారు.

ఈ ప్రాంతం రైతులు పశువుల పెంపకంపై ఎక్కువ శ్రద్ధ చూపుతారు. వర్షాధార వ్యవసాయంలో రసాయనాలు వాడరు. వీరు విరివిగా పండించే పంటలు వరి, జొన్నలు, రాగులు, సజ్జలు యితర చిరుధాన్యాలు. ఈ పంటల వలన వారికి ఆహారం దొరకడమే కాకుండా వాణిజ్య పంటలు కూడా వేసుకోవటం వలన అదనపు ఆదాయం కూడా వస్తుంది. రామనాథపురం లోని ప్రజలు వయస్సుతో సంబంధం లేకుండా అందరూ ఆరోగ్యకరమైన ఆహారంపై దృష్టి సారిస్తారు. మనందరికీ ఖర్జూర బెల్లం గురించి తెలుసు కదా అవి తినటానికే కాక ఆయుర్వేద ఔషధాలలో కూడా వాడతారని చాలా మందికి తెలీదు కానీ, అక్కడివారందరికీ తెలుసు.

స్థానిక మహిళలకు వంటల పోటీలు పెట్టాం. 'కొంబాడీ'కి చెందిన 'మేరీ' అనే మహిళ, 'కున్నపెనాండర' గ్రామానికి చెందిన 'శశికళ' అనే మహిళ 'కంబ' అనే వంట చేశారు. దీన్ని మధుమేహ వ్యాధి ఉన్నవారు తింటే వ్యాధి నియంత్రణలో ఉంటుందట. 'వినీనన్' అనే అతను 'ఉస్తి' ఆకులు బియ్యం పిండి కలిపి రొట్టెలు చేశాడు. ఇది కూడా మధుమేహ వ్యాధి ఉన్నవారికి మేలు చేస్తుందట. రాగి ఇక్కడి ప్రజల ప్రధాన ఆహారం. రామనాథపురంలో మేము రాగి పుట్టు (సంకటి) తిన్నాం దానిలో కొబ్బరి కోరు, బెల్లం, నూనె, ఉల్లిపాయలు ఎర్ర మిరపకాయలు వేసి చేశారు. దీనివలన కొవ్వు కరిగి, అరుగుదల పెరిగి, ఎముకలు గట్టి పడతాయట. వీటిని 'ముట్టివెంచెరిగర్, విటిమల, వట్టారే కలిసి తయారు చేశారు. కొంబిడి గ్రామానికి చెందిన జాన్ మేరీ, రాగి రొట్టెలతో బెల్లం, మునగాకు, చిన్న ఉల్లిపాయలు, నువ్వులు కలిపింది అవి తింటే శరీర ఉష్ణోగ్రతలో సమతుల్య వుండి, శరీరానికి శక్తి వస్తుందట. ఇవికాక మన భాషలో చప్పుకోవాలంటే పెసర పుణుకులు, పూర్ణం బూరెలు చేశారు యివన్నీ శరీరానికి ఓపిక, శక్తినిస్తాయి. మందార ఆకులతో షర్బత్ చేశారు. 'జిగసరటండా' అనే పానీయం దంచిన బాదం, పాలు, పంచదారలు కలిపి చేస్తారు. ఇది శరీరాన్ని చల్లబరచి శక్తినిస్తుందట.

'ధర్మవీర్ కాంబోజ్' తయారు చేసిన మల్టి పర్పస్ ప్రాసెసర్ వాడితే సరైన వేడి వేగం నియంత్రిస్తూ మంచి నాణ్యమైన రసాలు, పల్ప్‌లు తయారు చేసుకోవచ్చని అక్కడ ఊరగాయలు తయారు చేసే వారికి చెప్పారు. ఆయనే స్వయంగా శోధయాత్రలో పాల్గొని తన పరికరం ఏవిధంగా నడపాలో, దానిని వాడి, పానీయాలు, సిరప్‌లు, మిఠాయిలు, ఊరగాయలు మొదలైనవి చేసే విధానం చూపించాడు.

**సాంప్రదాయ ఔషధ మొక్కలు – మూలికలు :** ఆరోగ్యకరమైన ఆహారం కొనాలనుకునే అక్కడి సమాజానికి తోడుగా మొక్కల ఆధారిత ఔషధాలు ఉంచుతున్నారు. మేము పరమాకుడి అనే గ్రామం నుండి రామేశ్వరంకు నడుస్తూ ఉంటే మాకు దారిలో దాదాపు 30 ఎకరాల మూలికా వైద్య పద్ధతులను పరిచయం చేశారు సి. మోహన కృష్ణ. మొక్కల ఆధారిత మందుల గురించి చెప్పారు. తాను ఆయుర్వేద పండితుడినని, ఈ జ్ఞానం తన పూర్వీకుల నుంచి తెలుసుకున్నాడట. వంశపారంపర్యంగా తెలుసుకొన్న జ్ఞానానికి తాను పచమలై మరియు కోలీ కొండలపైన దొరికే ఔషధ మొక్కలను పరిశీలించి స్వంత జ్ఞానాన్ని జోడించి వైద్యం చేస్తున్నాడట. తను ఆయుర్వేదానికి పనికి వచ్చే కొత్త మొక్కలను కనిపెట్టాడట. తన పొలంలో సేంద్రియ పద్ధతిలో దాదాపు 1000 రకాల ఔషధ మొక్కలను పెంచి మందులను/ మొక్కలను విక్రయిస్తున్నాడట. ఆయన కాంభోజ్ గారితో కలిసి మాట్లాడి అతని ద్వారా ఇంకా ఎక్కువ నాణ్యతగల రసాలు, పొడులు చేసుకొనే పద్ధతులు తెలుసుకొన్నాడు. ఆరోగ్యకరమైన జీవన విధానం కోరుకునే వారందరికీ దేశ వ్యాప్తంగా తన మందులు అందించాలని కోరిక అని చెప్పాడు కృష్ణ. ఇటువంటి వ్యక్తుల వల్లనే మన సాంప్రదాయ ఔషధాలు రక్షింపబడుతున్నాయి అని అతడ్ని మెచ్చుకొన్నారు యాత్రీకులు.

యాత్రీకులు 'ఇల్లామున్నూర్' గ్రామంలో జీవ వైవిద్యంపై చిన్న పిల్లలకు ఒక పోటీ నిర్వహించారు. స్థానికంగా దొరికే మొక్కలను గుర్తుపట్టి, కాయాష్, రాజ్యశ్రీ, మీనాక్షి, హర్షితాశ్రీ, హర్షిణి లు పోటీలో







నెగ్గి బహుమతులు గెలుచుకున్నారు.

సుమారు 237 కిలోమీటర్ల సముద్ర తీరం ఉన్న కారణంగా రామనాథపురం సముద్ర నాచు సాగుకి చాలా అనువుగా ఉంటుంది. అక్కడి ఈ నాచును సేకరించే 800 మందిలో అధిక భాగం మహిళలే. ప్రతీసారి సముద్రంలోకి వెళ్ళటానికి వోథల్ అనే చిన్న పడవలను రూ. 1100/-లు అద్దె ఇచ్చి (ఒకసారి వెళ్ళి రావటానికి) బాడుగకు తీసుకుంటారు. తీరం నుంచి 5-6 కి.మీ. దూరం సముద్రంలో ఉన్న చిన్న దీవులకి వేథెల్ పడవలతో వెళ్ళి ఒక్కోసారి 2-3 రోజులు ఆ సముద్రం మీదే ఉండిపోతారు. కళ్ళకి ప్రత్యేకమైన ఈత కళ్ళద్దాలు పెట్టుకొంటే నీళ్ళలో కూడా నాచు కనిపిస్తుంది. అద్దాలు ధరించి నీటిలోకి 8 అడుగుల దాకా వెళ్ళి నీటిలో రాళ్ళకి పట్టి వ్రేలాడుతున్న సముద్ర నాచుని సేకరిస్తారు. ఒక్కో పడవలో 300-500 కిలోల నాచుని తెచ్చి సుమారు రూ. 4,000/- వరకు అమ్ముతారు. వీరికి అమావాస్య రోజులలో నీటి పోటు తక్కువగా ఉన్నపుడు నాచు తేలికగా దొరుకుతుంది అంటారు వారు. వీరు సేకరించిన సముద్ర నాచు నుండి అగర్ ఆగర అనే కూరలలో, తీపి పదార్థాలలో, మందులలో వాడే ద్రవాలు చిక్కపడ టానికి (పేరుకునేందుకు) సాయపడే పదార్థం తయారు చేస్తారు. స్థానికంగా ప్రజలు ఉపవాసం పూర్తయిన తరువాత ఈ పదార్థాన్ని నీటిలో కలుపుకొని త్రాగుతారు. ఉపవాస విరమణకి ఈ పద్ధతి పాటిస్తారు అక్కడి ప్రజలు.

**కొత్త రకంగా వల వేసే పద్ధతులు :** రామనాథపురం ప్రజలు ఓర్పు, లావణ్యం, స్వంతంగా ఆలోచించే శక్తి కల వారనిపించింది. ఎందుకంటే అక్కడి మత్స్యకారులు స్థానికంగా వాడే పద్ధతులతో పాటు, నూతన మాలను కూడా వాడుతున్నారు. వారు సాంప్రదాయ పద్ధతిలో అయితే ఒక పెద్ద ప్లాస్టిక్ సంచీలో చెడిపోయిన చేపలుంచి, సంచి క్రింద రాళ్ళ బరువులు పెట్టి నీటిలో 10-12 అడుగుల క్రిందకి వదులుతారు. ఆ చెడిపోయిన చేపల కోసం కొన్ని చేపలు ఆ సంచిలోకి రాగానే జాలర్లు ఆ సంచిని నీటిపైకి లాగేస్తారు. ఆ విధంగా సంచిలో చిక్కుకున్న చేపలు వేటలో దొరుకుతాయి. భారీ సంఖ్యలో చేపలు పట్టకున్నా కొన్ని రకాల చేపలు దొరుకుతాయి. ఒరమీను రకం (చేపల పులుసు చేసుకోవటానికి పనికి వచ్చే) చేపలు పట్టుకుంటూ ఉంటారు.

కలై కరై గ్రామంలోని రుక్కమ్మ అనే స్థానిక మహిళా జాలరి స్క్విడ్ (కొమటి సంచులు లేదా చెలదూరి) అని పిలవబడే సముద్ర జీవులని పట్టుకోవటానికి ఒక కొత్త సులభమైన మార్గం కనిపెట్టింది. ఈ రకం చేపలు సాధారణంగా అడవి నీలిమందు లేదా వెంపలి చెట్ల దగ్గరకి







అనుకోకుండా తేలుతూ వచ్చేస్తాయి. అని గమనించి ఆమె ఈ వెంపలి చెట్ల కొమ్మలని క్రింద రాళ్ళు బరువుగా పెట్టి నీటిలో 10 అడుగుల లోతు పంపుతారు. వారు ఈ విధంగా ఎక్కడ చెట్లను దింపారో గుర్తుంచు కోవటానికి నీటిలో తేలియాడే ప్లాస్టిక్ సీసాలను కడతారు. అవి కదిలితే క్రింద నీటిలో చెట్టు కొమ్మల చుట్టూ కొమిటి సంచులు లేదా చెలదూరి చేపలు చేరాయని గుర్తించి, కొమ్మని కొమ్మతో పాటు చేపలని పైకి లాగేస్తారు. ఈ విధంగా ఎక్కువ శ్రమ పడకుండా అవే వచ్చి దొరికి పోతాయి. ఈ రకం చేపల మాంసం తినటానికే కాక, వీటిలోనుండి ఒక రకమైన రంగు సిరాని కూడా తయారు చేసి విక్రయిస్తారు.

అదేవిధంగా పిల్లల బొమ్మలకి ఎరుపు, గులాబీ, నలుపు రంగులు వేసుకోవటానికి రకరకాల చేపలలో నుంచి ఆ రంగులని సేకరిస్తారు. రంగు తియ్యగా మిగిలిన పదార్థం పొలాలకి ఎరువుగా వాడుకుంటారు. ఈ జాలరులంతా యాత్రీకుల సలహాపై ఇ-కామర్స్ పద్ధతి ద్వారా తమ సరుకుని ఎక్కువగా అమ్మి అధిక ఆదాయం పొందే మార్గాలను గురించి చర్చించి నిర్ణయించుకుంటమని అన్నారు.

గ్రామ పెద్దలు సాంప్రదాయంగా ప్రకృతిని రక్షించే పద్ధతులు అమలు కావటం లేదని బాధపడుతున్నారు. విచక్షణా రహితంగా తాటిచెట్లు నరకటం, వర్షం లేకపోవటం వల్ల తాటి తోపులు నశించి పోతున్నాయి. స్థానిక తాటిచెట్ల పెంపకందార్ల సమాఖ్య అధ్యక్షులు 80 సంవత్సరాల మోహన్ కృష్ణ తాటిచెట్ల పట్ల ప్రజలు, ప్రభుత్వాలు కూడా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు అన్నారు. ఎన్నిసార్లు ప్రభుత్వాలను కోరినా తాటి సాగుని కుటీర పరిశ్రమగా గుర్తించమని అడిగా, ఇప్పటి వరకు అది సాకారం కాలేదన్నారు.

మేము చాలా చిన్న గ్రామస్థాయి ఇన్నోవేషన్‌లను గమనిం చాం. వారి సమస్యలకి వారే సమాధానాలు కనుగొనటం శుభసూచకం. కొబ్బరి వ్యవసాయదార్లు తమ చెట్లపైకి ఎలుకలు ఎక్కకుండా రక్షణ కవచంగా "నున్నని" రక్షణ కంచెల లాటి వాటితో చెట్ల మొదళ్ళకు చుట్టారు. ఇలా ఎందుకని అడగగా, నున్నగా ఉంటే ఎలుకలు చెట్లు ఎక్కలేవు అని చెప్పారు. ఇంకొకచోట ఇటుకలు చేసేవారు చెక్క అచ్చులు వాడుతున్నారు (దేశంలో చాలామంది ఈ పని చేస్తున్నారు) దానితో ఇటుకలు ఒకే రకంగా వస్తాయి అని చెప్పారు. ఇంకొక గ్రామంలో మంచినీటి బిందెలు తెచ్చుకోవటానికి తోపుడు బండ్ల లాంటి వాటిని వాడుతున్నారు. వాటి సహాయంతో ఒకేసారి 100 నుంచి 120 లీటర్ల నీటిని తరలించవచ్చు. మీకు ఇంకేం కావాలి అని అడిగితే తేలికైన కొడవళ్ళు, పొగరాని మట్టి పొయ్యిలు కావాలన్నారు.

**సాంస్కృతిక రక్షణ - యువత :** స్థానికంగా 'మదర్‌వే' పేరిట సాంప్ర దాయ మిఠాయిలని చిన్న పిల్లలకని తయారు చేసి అమ్ముతున్నారు. వేరుశనగ పాకపు 'అచ్చులని' స్థానికంగా దొరికే తాటి బెల్లం, వేరు శనగలు, నువ్వులు, యాలకులు, శొంఠి లాంటి పదార్థాలను

ఉపయోగించి, పిల్లలకని చక్కని అందమైన పాకెట్లలో అమ్ముతున్నారు. తద్వారా పిల్లలకి ఫ్యాక్టరీలలోని కల్తీ ఆహార పదార్థాల స్థానంలో మంచి ఆరోగ్యకరమైన తినుబండారాలు అందుబాటులోకి వస్తున్నాయి.

కుకూ అటవీ పాశాలలో పని చేసే స్టాలిన్ అనే యువకుడు కూడా శోధయాత్రలో పాల్గొన్నాడు. తమ పాఠశాలలో సంపూర్ణ విద్యని అందిస్తున్నామని చెపుతూ, పిల్లల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడేలా విద్యతో పాటు లలిత కళలు, రక్షణ యుద్ధ కౌశల్యంతో పాటు తరచూ సాంఘిక, రాజకీయ, సామాజిక విషయాలపై చర్చలు, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన, లాభాలు గురించి చెపుతూ వారికి వ్యవసాయంపై అవగాహన పెంచి, దీనిపై మక్కువ కలిగిస్తున్నామని చెప్పారు. ఆ పరిసర గ్రామాలలోని పిల్లలు పేద కుటుంబాల నుంచి వస్తున్నారు కనక వారికి ఉచిత వసతితో పాటు ఉచిత విద్య, భోజన సదుపాయాలు కూడా కల్పిస్తున్నామని చెప్పాడు.

సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా పిల్లలు వెదురు కర్రలతో స్వయం రక్షణ విధానం తెలిపే 'సిలాంబం' విద్యని ప్రదర్శించారు. ఎగురుతూ, దూకుతూ తమ శరీరంలోని ప్రతి భాగాన్ని శత్రువుల దాడినుంచి రక్షించుకొనే పద్ధతి ప్రదర్శించారు. డా. ఎపిజె అబ్దుల్ కలాం గారు ఈ జిల్లా నుంచే వచ్చారు. అందుకే ఆయనని యువత స్ఫూర్తిగా తీసుకొంటుంది.





ఇల్లా మనుర్ గ్రామంలో కొందరు యువ ఇన్నోవేటర్‌లు తారసపడ్డారు. రోషన్ అనే యువకుడు ఒక చిన్న గాలిమరతో సెల్‌ఫోన్‌ను ఛార్జి చేసే పద్ధతి కనుగొన్నాడు. యామియ్య వాలం అనే యువకుడు తన ఇంట్లో దొరికిన పాత సామానులతో తన మోటార్ సైకిల్‌ను వేగంగా వెళ్ళే పద్ధతి కనుగొన్నాడు. ఏదో ఒకరోజు కెటిఎం బైక్‌పై రేసులో పాల్గొనాలని అతని అభిలాష.

శోధయాత్ర కేవలం ప్రజల నేర్పరితనం, చాతుర్యాలు తెలుసుకోవటానికి మాత్రమే కాక వారికున్న సహజసిద్ధమైన అభిరుచులను కూడా కనుగొనటం కూడా యాత్రలో భాగమే. ఇవి అక్కడి ప్రజల సంస్కృతి, పర్యావరణాలను పూర్తిగా అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది. మాకు మరపురాని ఆనందాన్ని, సంతృప్తిని యిచ్చిన సంఘటన ఏంటంటే మేము ఒక గ్రామంలోంచి వెడుతుంటే ఒక చిన్న పిల్ల తను కోస్తున్న తాటి పళ్ళని రుచి చూడండి బాగుంటాయి అని మాకివ్వటం. ఆ చిన్న చర్యలో ఆ ప్రాంత ప్రజలు వారి మనసు, ప్రవృత్తి, పూర్తిగా అర్థం అయినాయి. ఇంకొక ప్రదేశంలో ఒక మహిళ తను రోజంతా కష్టపడి ఎండలో కోసుకున్న 'పొట్ల కాయలను' మాకు ఉచితంగా యిచ్చింది. వారి ఉదారతను దీవెనలుగా స్వీకరించాము.

నిజంగా మేము జరిపిన చాలా శోధయాత్రలకన్నా ఇది వైవిధ్యంగా ఉందని చెప్పాలి. ఈవిధంగా ఇన్ని కొత్త విషయాలతో, కొత్త మనుషులతో, కొత్త అనుభవాలతో మా శోధయాత్ర ముగిసింది. ●

## శ్రద్ధాంజలి



**కీ.శే. సయ్యద్ సుభాని**
ఇన్నోవేటర్
నాగభైరవ పాలెం, చిలకలూరి పేట, గుంటూరు జిల్లా

'పల్లెసృజన' సీనియర్ ఇన్నోవేటర్,
లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత
**సయ్యద్ సుభాని** గారు
తేది 30-12-2023 న
'కాలధర్మం' చేశారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.
కేవలం 15 నిమిషాల్లో ఒక ఎకరం పొలానికి పురుగు మందు పిచికారి చేసేలా 'బూమ్ స్ప్రేయర్' తయారు చేసి, ప్రపంచ రికార్డ్ సాధించారు. అంతటితో ఆగక రైతు ఏ పంటకు పురుగు మందు పిచికారి చేయాలన్నా సరే, స్ప్రేయర్ ఎలా ఉంటే శ్రమ, ఖర్చు తగ్గుతుంది అని ఆలోచించి, ఎన్నో రకాల స్ప్రేయర్లను తయారు చేసి రైతు లకు అందించిన 'సుభాని' ఎవరికీ అందని లోకాలకు వెళ్ళిపోవటం రైతు లోకానికి తీరని లోటు.

సుభాని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ....
వీరి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాము.
- 'పల్లెసృజన' కుటుంబం

# గొర్రెలు, పశువులకు దాణాగా ఉపయోగించేలా ఎండు గడ్డిని చిన్న ముక్కలుగా చేసే యంత్రం చేసిన 'జలీల్'



- పల్లె వీరరాఘవ రెడ్డి

ఏ రైతును కదిలించినా, రైతుకు సంబంధించిన ఏ వాట్స్ యాప్ గ్రూపును చూసిన యావన్మంది రైతులు ముక్త కంఠంతో చెప్పే సమస్య ఒక్కటే 'కూలీలు లభించటం లేదు' లేదా 'లేబర్ సమస్య' అందువల్ల వ్యవసాయం చేయటం చాలా కష్టంగా, నష్టంగా మారుతోంది. ఈ సమస్య ఒక్క పంటలు పండించే రైతులకే కాదు, కోళ్ళ పెంపకం, పాడి పరిశ్రమ మొదలుకొని ఆఖరుకు గొర్రెల పెంపకం దారులను కూడా వేధిస్తోంది ఈ కూలీల సమస్య.

ఇలా కూలీల సమస్య పెరిగే కొద్దీ కొత్త కొత్త వ్యవసాయ పరికరాలు మార్కెట్‌లోకి వచ్చి కూలీల సమస్యను చాలా వరకు తగ్గిస్తున్నాయి. కానీ ఇక్కడ ఇంకో సమస్య ఎదురవుతోంది. కొన్ని యంత్రాల ద్వారా వరిగడ్డి కోస్తే ఆ గడ్డిని పశువులకు మేత వేయటం కోసం నిలువ చేసుకునేందుకు 'వాము' వెయ్యటానికి వీలు కాదు. ఎందుకంటే ఆ గడ్డి అక్కడే పొడి పొడిగా తయారవుతుంది. ఇలా పొడి పొడిగా తయారైన గడ్డిని పశువులు బాగానే మేస్తాయి కానీ, దాన్ని ఎక్కువ రోజులు నిలువ ఉంచలేరు రైతులు. ఎందుకంటే ముక్కలైన వరిగడ్డి వాము వెయ్యకుంటే అది ఒక్క వర్షం పడినా చాలు మొత్తం మురిగి పోతుంది. అందుకే కొందరు స్థోమత గల రైతులు ఆ వరిగడ్డి ముక్కలను దిబ్బలకు చేర్చి ఎరువుగా మార్చుకుంటే, మరి కొందరు రైతులు (పశువులు లేని వారు) ఆ గడ్డిని పొలంలోనే తగలబెట్టేస్తూ ఉంటారు.

మరి కొన్ని రకాల యంత్రాలు గడ్డిని కొంత వరకు పొడి చేసినా, వాటిని కట్టలు కట్టేందుకు ట్రాక్టర్ అనుసంధాన పరికరాలు వచ్చాయి. కాబట్టి ఆ గడ్డిని కట్టలు కట్టించుకుని, వాటిని వాము వేసి అవసరమైనంత తీసుకుని పశువుల మేతగా ఉపయోగిస్తూ ఉంటారు. పూర్వం ఇలా జరిగేది కాదు. వరికోతలు మనుషులచేత కోయించి, వాటికున్న వడ్లను నూర్పిడి చేసి, ఆ వరిగడ్డిని సులభంగా వాము వేసుకునే వారు. ఈ పని చాలా మందితో కూడుకున్న పని కాబట్టి ప్రస్తుతం రైతులు వారికి అందుబాటులో ఉన్న యంత్రాలతోనే వరి నూర్పిళ్ళు చేస్తూ ఉన్నారు.

ఈ పరంపరలో గతంలో 'పల్లెసృజన' పాఠకులకు విద్యుత్ వైర్ల నుండి సులువుగా రాగి, సిల్వర్ వైర్లను వేరు చేసే యంత్రం తయారు చేసిన విజయవాడ వాసి జలీల్‌ను ఒక గొర్రెల పెంపకం దారుడు కలవటం జరిగింది. ఆ రైతు జలీల్‌తో మా గొర్రెలను వర్షాకాలంలో అయితే పచ్చిగడ్డి మేత కొరకు అడవులకు తీసుకు వెళ్ళి మేపుకుని వస్తూ ఉంటాం. ఎండా కాలం పచ్చి గడ్డి లభించటం కష్టం కాబట్టి వరిగడ్డి తీసుకుని, దాన్ని ముక్కలుగా చేసి, అందులో కొంత దాణా కూడా కలిపి గొర్రెలకు వేస్తే అవి బాగా తింటాయి. కానీ, ఈ వరిగడ్డిని చిన్న చిన్న ముక్కలుగా చేయటానికి ఎక్కువ కూలీల ఖర్చు అవుతోంది. పచ్చిగడ్డిని ముక్కలుగా నరికే 'చాప్ కట్టర్'లో వేస్తే వరిగడ్డి ముక్కలు కాకుండా, లోపల బ్లేడ్లకు చుట్టుకుని పోతుంది. ఏదైనా పరిష్కారంగా యంత్రం తయారు చేసి ఇవ్వమని కోరటం జరిగింది.

ఈ సమస్యను రైతువద్ద విన్న జలీల్ 'సరే ఆలోచిస్తాను' అని పచ్చి గడ్డిని ముక్కలు చేసే చాఫ్ కట్టర్‌ను పరిశీలించి, ఇందులో ఎండు గడ్డి ఎందుకు ముక్కలు కాదో తెలుసుకున్నాడు. ఆ సమస్యను పరిష్కరిస్తూ తానే ఒక యంత్రాన్ని తయారు చేసి ఇచ్చాడు ఆ రైతుకు.

జలీల్ చేసిన యంత్రంలోకి కొద్ది కొద్దిగా గడ్డిని అందిస్తూ వెళ్తుంటే లోపలికి తీసుకున్న ఆ గడ్డిని చిన్న చిన్న ముక్కలుగా చేసి మరో వైపు బయటకు వచ్చేలా చేస్తుందా యంత్రం. అలా ముక్కలైన గడ్డిలో ఆ రైతు కొంత దాణా కలిపి గొర్రెలకు మేపటం జరిగింది. ఆ గడ్డి చిన్న చిన్న (దాదాపు అర అంగుళం కన్నా తక్కువ పొడవు) ముక్కలుగా ఉండటం వల్ల గొర్రెలు ఆ గడ్డిని చాలా బాగా తిన్నాయి. రైతు తన గొర్రెలు ఈ గడ్డి

ముక్కలను బాగా తినటం చూసి హమ్మయ్య సమస్య తీరిపోయింది అని ఆనంద పడ్డాడు. ఇక్కడ రైతుకు ఈ యంత్రం వల్ల మరో లాభం జరిగింది. అది ఏమిటంటే, మేతను గొర్రెలు బాగా మేయటం వల్ల సాధారణంగా పెరిగే బరువుకన్నా, కొంత ఎక్కువ బరువు పెరగటం వల్ల వాటికి మార్కెట్‌లో మంచి లాభాలు రావటం జరిగింది. ఈ విషయాన్ని తోటి గేదెలు, గొర్రెల పెంపకం రైతులతో తన ఆనందాన్ని పంచుకోవటంతో ఆ రైతులు కూడా జలీల్ వద్దకు వచ్చి తమకూ గడ్డిని కత్తిరించే యంత్రం కావాలని తయారు చేయించుకు వెళ్ళటం జరిగింది.

జలీల్ తయారు చేసిన యంత్రం వల్ల ఆ రైతులకు వరిగడ్డి, జొన్న చొప్పలను సులభంగా చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని, అందులో కొంత దాణా కలిపి పశువులకు, గొర్రెలకు తినిపిస్తున్నారు. ఇలా చేయటం వల్ల గేదెల రైతులకు అధిక పాల దిగుబడి, గొర్రెల బరువు త్వరగా పెరిగి, మార్కెట్‌లో మంచి రేటు లభించటం వల్ల లాభాలను ఆర్జిస్తున్నారు.

ఈ యంత్రంతో 3–4 గంటల పాటు కత్తిరించిన మేత 2–3 రోజుల వరకు వస్తుందని, ఆ ముక్కలు చేసిన మేతను పశువులకు వేసే ముందు కొద్దిగా నీటితో తడిపి, అందులో కొంత దాణా కలిపి తినిపిస్తూ ఉండటం వల్ల అవి పచ్చిగడ్డి తిన్నట్లుగానే చాలా బాగా తింటున్నాయని, ఈ యంత్రం వల్ల తమకు గడ్డిని, జొన్న చొప్పను ముక్కలు చేయటానికి అయ్యే శ్రమ, ఖర్చు తగ్గిందని అన్నారు. సాధారణంగా మనిషి వాటిని ముక్కలు చేస్తే ఇంత సన్నటి ముక్కలు చేయటం చాలా కష్టమని, ఈ యంత్రం వల్ల ఆ సమస్య తీర్చినందుకు జలీల్‌ను అభినందిస్తున్నారు ఆ రైతులు.

ఈ యంత్రంతో కేవలం ఎండిన గడ్డినే కాదు, పచ్చి గడ్డిని కూడా చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవచ్చు. పచ్చి గడ్డిని చాఫ్ కట్టర్ తో నరికితే ఒక్కో ముక్క 2–4 అంగుళాలు ఉంటుంది. కాబట్టి పశువులు కొంత మేతను తినకుండా వదిలేస్తూ ఉంటాయి. కానీ, ఈ యంత్రంతో పచ్చి గడ్డిని కత్తిరించినా అర అంగుళం అంతకన్నా చిన్న ముక్కలుగా అవుతుంది కాబట్టి పశువులు మేతను ఏమాత్రం వదిలి పెట్టకుండా మొత్తం తినేస్తాయి. చాఫ్ కట్టర్ కన్నా ఈ యంత్రం ఎన్నో విధాలుగా మేలు చేస్తుందంటున్నారు రైతులు.

జలీల్ ఈ యంత్రాన్ని పశువుల గడ్డి కొరకు తయారు చేసినా దీనితో మరో అద్భుతమైన పని జరిగే అవకాశం ఉంది. అదేమిటంటే, కంది రైతులు కంది పంట కోసి, నూర్పిడి చేసిన తర్వాత ఆ వ్యర్థాలను గతంలో పొయ్యిలోకి వాడుకునే వారు. కానీ, ఇటీవల కట్టెల పొయ్యిమీద వంట చేసే వారే కరువవటంతో వాటిని కొందరు దిబ్బల్లో వేసి మురగ బెడితే, మరి కొందరు నిప్పుతో తగలబెట్టేస్తున్నారు. దిబ్బల్లో వేసినా, అవి త్వరగా కంపోస్టుగా మారటం కుదరదు. కాబట్టి కందిచెట్టు వృధాను కూడా ఈ యంత్రం ద్వారా చిన్న చిన్న ముక్కలుగా చేసి దిబ్బలో వేసినట్ల యితే మంచి పోషకాలు గల కంపోస్టు ఎరువుగా మారుతుంది.

అలాగే మొక్కజొన్న పంట కోసిన తర్వాత వాటి అవశేషాలు అలాగే పశువులకు వేస్తే అవి అస్సలు తినవు. ఎందుకంటే ఆ దంటు కొద్దిగా లావుగా ఉంటుంది, రుచి కూడా జొన్న దంటు లాగా ఉండదు. కాబట్టి ఈ యంత్రం ద్వారా మొక్కజొన్న దంట్లను చిన్న ముక్కలుగా కత్తిరించి, అందులో పశువుకు రుచికరంగా ఉండేందుకు కొంత దాణా కలిపి ఇచ్చినట్లయితే వాటిని కూడా అనవసరంగా కాల్చివేయకుండా, ఎరువుగా లేదా పశువులకు మేతగా ఉపయోగించుకోవచ్చు.

ఈ యంత్రం రైతు అవసరాన్ని బట్టి, దాని సామర్థ్యాన్ని కూడా పెంచుకునే అవకాశం ఉంటుంది అన్నాడు ఇన్నోవేటర్ జలీల్. ప్రస్తుతం తయారు చేసిన ఈ యంత్రం ఒకటిన్నర అడుగుల వెడల్పు, రెండు అడుగుల పొడవు, మూడు అడుగుల ఎత్తు మరియు దాదాపు వంద కిలోల వరకు బరువు ఉంటుంది. ప్రస్తుతం చేసిన ఈ యంత్రం పాడి రైతులకు, గొర్రెల పెంపకం దారులకు సరిపోతుంది. కానీ, పెద్దయెత్తున కంపోస్టు ఎరువు తయారు చేయాలి అనుకున్న వారు ఇన్నోవేటర్‌ను లేదా పల్లెసృజన ను సంప్రదించినట్లయితే మీకు అనువైన యంత్రాన్ని తయారు చేసి ఇస్తాడు. గ్రామాల్లోని నిరుద్యోగులు ఇలాంటి యంత్రాన్ని ఒకదాన్ని ఏర్పాటు చేసుకుంటే మీ ప్రాంతాల్లోని వ్యవసాయ వ్యర్థాలను సేకరించి, వాటిని కంపోస్టు ఎరువుగా తయారు చేసి రైతులకు ఆరోగ్యకరమైన, సేంద్రియ ఎరువును అందించటంతో పాటు, వాతావరణ కాలుష్యాన్ని కూడా నివారించిన వారవుతారు.

ఈ యంత్రం ప్రస్తుతం 60 వేల రూపాయల వరకు ఖర్చవుతుంది. సామర్థ్యం పెంచుకోవాలి అనుకుంటే అందుకు అదనంగా కొంత డబ్బు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ యంత్రాన్ని నిపుణులతో పరీక్షించి ఇంకా ఏవైనా ఉపయోగాలు, ఇంకా ఏమైనా వేరే పనులు ఈ యంత్రం ద్వారా జరిగే అవకాశాలు పరిశీలిస్తోంది 'పల్లెసృజన'.

**ఇన్నోవేటర్ జలీల్ ఫోన్ : 9912499061**

## 'పల్లెసృజన' ఇన్నోవేటర్లకు ఒక సృజనాత్మక రైతు 'పరిష్కారం' కొరకు అందించిన 'సమస్య'

"సాధారణంగా ఏవైనా శుభ కార్యాలు, హొటళ్ళలో భోజనం అయిన తర్వాత 'స్వీట్' లేదా 'పాన్' ఇస్తూ ఉంటారు. ఈ రెండింటి వల్ల శరీరానికి ఎంతోకొంత నష్టం వాటిల్లుతుంది. వాటి స్థానంలో చిన్న చెరుకు ముక్క ఇచ్చినట్లయితే, భోజనం తర్వాత ఆ చెరుకు ముక్కను తింటే నోరు శుభ్రం అవుతుంది. కొంత తీపిదనం నోటికి కలుగుతుంది" అని తెలియజేస్తున్నారు కోనసీమ జిల్లా, రావులపాలెంకు చెందిన యం. వీరారెడ్డి అనే రైతు.

"కానీ, ఈ చిన్న చెరుకు ముక్కను చెరుకు గడ నుంచి వేరు చేసి ఇవ్వాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని. కాబట్టి ఎవరైనా ఇన్నోవేటర్లు చెరుకు గడ పైనున్న తోలు వలిచి, చిన్న చిన్న ముక్కలుగా (ఒక అంగుళం పొడవు, పెన్సిల్ అంత లావు ఉంటే చాలు) చేసి ఇచ్చేలా ఏదైనా ఒక చిన్న యంత్రం తయారు చేసినట్లయితే, అది రైతులకు ఉపయోగకరంగా, అధిక లాభాలు ఆర్జించేలా ఉండటంతో పాటు సమాజానికి కూడా ప్రకృతిపరంగా లభించిన తియ్యదనాన్ని నోటికి అందించినట్లు అవుతుంది. నోరు కూడా చెరుకు ముక్క తినటం వల్ల శుభ్రం అవుతుంది.

కావున ఇన్నోవేటర్లు నా సమస్యను అర్థం చేసుకుని, వీలైనంత త్వరలో ఒక చిన్న యంత్రం లేదా పరికరం తయారు చేసి ఇస్తారని ఆశిస్తున్నాను.

- వీరారెడ్డి, రావులపాలెం, కోనసీమ జిల్లా.
ఫోన్:9533361515



# జాతీయ అవార్డు పొందిన
# గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**జాతీయ ప్రోత్సాహక పురస్కారం**

**'నాథ్ జంబో' సీడ్‌లెస్ - అభివృద్ధి చేసిన నల్ల ద్రాక్ష**

పేరు : **విఠల్ నివృతి థోరట్**

నివాసి : **పూనే, మహారాష్ట్ర**



మహారాష్ట్ర లోని పూణే ప్రాంతానికి చెందిన 76 సం. విఠల్ నివృత్తి థోరట్ గత 50 సంవత్సరాలు గా ద్రాక్ష పండించటం లోనే గడిపాడు. ఈయన ఎంతో కాలం పరిశోధనలు జరిపి 'నాథ్ జంబో సీడ్‌లెస్' అనే నల్ల ద్రాక్ష రకాన్ని రూపొందించాడు. ఇది పెద్ద వళ్ళతో పెద్ద గుత్తులతో ఎక్కువ తడిదనంతో చాలా కాలం నిలువ ఉంటాయి.

ఈయన తన తోటలోనే గ్రాఫ్టింగ్ పద్ధతి మరియు ఎంపిక పద్ధతి ఉపయోగించి రూపొందించాడు. 1997వ సంవత్సరంలో తన 'శరద్' రకం ద్రాక్ష చెట్లలో ప్రత్యేకించి మూడు చెట్లకి కాసిన ద్రాక్ష గుత్తులు పెద్దగా ఉండి, పండ్లు కూడా పెద్దగా చాలా తియ్యగా ఉండటం గమనించాడు. దీనినుంచి వచ్చిన పండ్లకి మార్కెట్‌లో మంచి ధర పలికింది. దీంతో ఈయన వేరువేరు ద్రాక్ష రకాలతో గ్రాఫ్టింగ్ పద్ధతిలో ఎంపిక పద్ధతిలో ప్రయోగాలు చేసి, మంచి లక్షణాలు స్థిరపడటానికి దాదాపు అయిదు సంవత్సరాలు పట్టింది. 2007లో ఈయన ఈ కొత్త రకానికి 'నాథ్ జంబో సీడ్‌లెస్' అని పేరు పెట్టి ఒక ఎకరం పొలంలో నాటాడు. 2011 నాటికి దీనిని గ్రాఫ్టింగ్ పద్ధతిలో 4 ఎకరాలకి పెంచాడు. ఆ తవాత తనకు తెలిసిన ద్రాక్ష పెంపకం దారులకి పరీక్షల నిమిత్తం యిచ్చాడు. ఈయన వద్దనుంచి ఈ రకాన్ని తీసుకొన్న ద్రాక్ష రైతులంతా చాలా బాగుంది, మంచి ధర పలికింది మార్కెట్‌లో అని చెప్పారు.

ఈ 'నాథ్ జంబో సీడ్‌లెస్' రకం 125-130 రోజుల్లో కోతకు వస్తుంది. 40 - 24 మి.మీ. సైజులో కోలగా వున్న పెద్ద కాయలు చాలా తియ్యగా ఉండి, పెద్ద గుత్తులలో ఎక్కువ దిగుబడితో దాదాపు 3 నెలలు నిలువ ఉండేలా మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. ఇది ప్రత్యేకించి విదేశాలకు ఎగుమతి చెయ్యటానికి చాలా అనువుగా ఉంటుంది. దీనికి కారణం ఎక్కువ కాలం నిలువ వుండటమే కాక, ఎక్కువ తియ్యగా ఉండి, పెద్ద సైజులలో ఉండటం. పూనేలోని నారాయణ్ గావ్, కృషి విజ్ఞాన కేంద్రం వారు ఎన్ఐఎఫ్ వారి సహకారంతో దీనిపై క్షేత్ర స్థాయిలో పరీక్షలు నిర్వహించి, సాధారణ ఇతర రకాల నల్ల ద్రాక్షకన్నా ఈ 'నాథ్ జంబో సీడ్‌లెస్' రకం మంచి రంగు, రుచి, సైజు కలిగి, ఎక్కువ కాలం నిలువ వుంటుంది కనుక మార్కెట్‌లో 25 నుంచి 40% ఎక్కువ ధర పలుకుతోందని నిర్ధారించి, ఐరోపా మరియు ఇతర ఆసియా ఖండపు దేశాలకు ఎగుమతులు చెయ్యటానికి చాలా అనువుగా ఉంటుందని చెప్పారు.

మహారాష్ట్ర లోని పూనే, నాసిక్, సాంగ్లి, షోలాపూర్, బారమతి, జున్నర్ లాంటి అనేక ప్రాంతాల్లోని రైతులు ఈ రకాన్ని దాదాపు 1000 ఎకరాల్లో పండించి లాభాలు పొందుతున్నారు. ఎన్ఐఎఫ్ వారు దీనిని పిపివి & ఎఫ్ఆర్ఎ, కొత్తఢిల్లీకి రిజిస్టర్ చెయ్యటానికి దరఖాస్తు చెయ్యటం జరిగింది.

ద్రాక్ష రైతులకి మేలైన నల్ల ద్రాక్ష రకాన్ని అందించిన పూనేకు చెందిన విఠల్ నివృత్తి థొరటాకి ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 కి గాను జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.



**జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి**

## అభివృద్ధి చేయబడ్డ 'సంజీవ్ సెలెక్షన్ కాలీఫ్లవర్'

పేరు :సంజీవ్ కుమార్

నివాసి : వైశాలీ జిల్లా, బీహార్.



బీహారు రాష్ట్రానికి చెందిన 40 సంవత్సరాల అభ్యుదయ రైతు సంజీవ్ కుమార్. ఇతను సాంప్రదాయ పద్ధతులలో కాలీఫ్లవర్, క్యాబేజీ, వంకాయ పంటలను పండిస్తూనే తన స్వంత ఆలోచన జోడించి ఈ పంటలను ఆధునిక పద్ధతులలో అభివృద్ధి పరచి ఎక్కువ దిగుబడి వచ్చేలా ప్రయోగాలు చేసి కృతకృత్యుడు అయ్యాడు. ఇతను ప్రత్యేకించి ఎక్కువ దిగుబడినిచ్చే, త్వరగా పంటకు వచ్చే క్యాలీఫ్లవర్ రకాన్ని రూపొందించి, దానికి 'సంజీవ్ సెలక్షన్' అని పేరు పెట్టుకున్నాడు. ఈ రకం చీడ పీడలను తట్టుకోవటమే కాక, పువ్వు తెల్లగా, ఒత్తుగా, బరువుగా ఉంటుంది.

సంజీవ్ కుమార్ 2009-2013 సం.ల మధ్యలో తాను పండించే సాంప్రదాయ కాలీఫ్లవర్ రకాలపైన ప్రయోగాలు చేసి త్వరగా కోతకు వచ్చేలా, ఒత్తుగా, బరువుగా తెల్లటి రకాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఎంపిక పద్ధతిపై రూపొందించాడు. తన ప్రయోగాల కృషి ఫలితంగా సంజీవ్ సెలక్షన్ రకాన్ని రూపొందించాడు. ఇది త్వరగా అంటే 60 నుండి 70 రోజుల్లో కాపుకి వస్తుంది. పెద్దగా, బరువుగా (940 గ్రా.) ఒత్తుగా ఉండి, హెక్టారుకి 175 క్వింటాళ్ళ పంట దిగుబడినిస్తుంది. ఇతనికి ఈ విషయంలో ఎన్.ఐ.ఎఫ్. వారు మరియు సాబూర్‌లో వున్న బీహార్ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు ఎంతో సహకరించారు. వీరు సంయుక్తంగా మూడు ప్రదేశాలలో విడివిడిగా జరిపిన ప్రయోగాలలో పండించిన పంట అధికంగా అంటే హెక్టారుకి 186.2 టన్నుల దిగుబడి ఇవ్వటమే కాక ఒత్తుగా, తెల్లగా, బరువుగా ఉండి విటమిన్ 'సి' అధిక శాతంలో ఉండటం గమనించారు.

2018లో ఐసిఎఆర్-ఐఎఆర్ఐ వారి స్థానిక విత్తన పరిశోధన కేంద్రంలో విత్తనాలను పరీక్షించగా 88.3% మొలకెత్తడమే కాక, స్వచ్ఛతలో 98.6%, 8.4 తేమ శాతం ఉన్నాయని నిర్ణయించారు. ఈ రకం గా సాంప్రదాయ రకాల కన్నా ఈ రకం ఎంతో మేలైనదని లాభసాటిదని సిఫారసు చేశారు. ఈ రకం అన్ని శీతోష్ణ పరిస్థితులలో పండించ గలమా అని ఎన్ఐఎఫ్ వారు ఆరు రాష్ట్రాలలో దీనిని వితరణ



చేసి మరీ పరీక్షించారు. అన్ని రాష్ట్రాల నుంచి చాలా ప్రోత్సాహకరమైన ఫలితాలు వచ్చాయి. ప్రత్యేకించి బీహార్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌ఘఢ్‌లలో చాలామంది రైతుల నుంచి త్వరగా కాపుకొస్తోందని, దిగుబడి ఎక్కువగా ఉన్నదని, 'మంచి మేలైనపంట' అని కితాబు లభించింది. బీహార్, ఉత్తరాఖండ్‌లలో ఈ రకం విరివిగా వ్యాప్తి చెందుతోంది.

సంజీవ్ కుమార్ గత పది సంవత్సరాలలో సుమారు 10 క్వింటాళ్ల విత్తనాలు విక్రయించాడు. ఈ రకాన్ని పివివి & ఎఫ్ ఆర్ చట్టం 2001 క్రింద రిజిష్టర్ చెయ్యటానికి ఢిల్లీలో దరఖాస్తు చేయటం జరిగింది.

ఈ ప్రత్యేకమైన మేలైన కాలీఫ్లవర్ రకాన్ని రూపొందించి నందుకు గాను సంజీవ కుమార్‌కి ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో తమ 10వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి ఇచ్చి సత్కరించారు. ●

**ఈ విత్తనాల కొరకు సంప్రదించండి:**

**సుభాష్ చందర్, ఫోన్ : 96528 01700**

**వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904 / 79890 38186**

## నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (NIF)లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఎన్నో యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై వెబ్‌సైట్ లో నిక్షిప్తం చేసింది. ఈ జ్ఞానమంతా www.nifindia.org వెబ్‌సైట్ లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే **NIF టోల్ ఫ్రీ నెంబర్: 1800 233 5555** కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది. అలా సంప్రదించలేని వారు 'పల్లెసృజన'ను సంప్రదించినా మీకు కావలసిన వివరాలు లభిస్తాయి. కావున మీ సమస్యలను గ్రామీణ సృజనలతో పరిష్కరించుకోవచ్చు.

**- ఎడిటర్**

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India

# జాతీయ 14 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**



## ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 14వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి బహుమతిగా రూ. **5,00,000**, జాతీయ రెండవ బహుమతిగా రూ. **3,00,000**, జాతీయ మూడవ బహుమతిగా రూ. **1,00,000**లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. **7,50,000**లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. **10,000**లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2025** లోగా మాకు చేరేలా పంపండి.

## దరఖాస్తు దారులకు గమనిక

వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.

మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.

దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.

మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.

మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.

## దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2025

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా **'పల్లెసృజన'** కార్యాలయాన్ని **(ఫోన్ : 040-40253096)** సంప్రదించండి.

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- వీరరాఘవ రెడ్డి

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 77 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

### గ్రామాల్లో తగ్గిపోతున్న హమాలీల కొరత తీర్చేందుకు

## నిర్వహణా ఖర్చులు లేని ట్రాక్టర్ క్రేన్‌తో ఉపాధి

పూర్వం గ్రామాల్లో పంటల నూర్పిడి సమయం వచ్చిందంటే చాలు రైతుల కళ్ళాలు ధాన్యపు సిరితో కళకళలాడుతూ ఉండేవి. వరి ధాన్యం నూర్పిడి చేసేందుకు వరిగడ్డి కొట్టే కూలీలు, జొన్నలు నూర్పిడి చేసేందుకు పెద్ద పెద్ద గుండ్లను వేసుకుని, జొన్న కంకులపై రెండు మూడు కాండ్ల ఎద్దులతో గుండ్రంగా తిరుగుతూ వున్న హడావిడి, తూర్పు పోసే వారు, ధాన్యం ఆరబెట్టేవాళ్ళు... ఇలా పండుగ వాతావరణమే ఉండేది. ఇప్పుడు ఈ హడావిడి అంతా పోయి, అన్ని ధాన్యాల నూర్పిడికి యంత్రాలు వచ్చేశాయి. పంట కళ్ళానికి రావాల్సిన అవసరం లేకుండా పొలంలోకే యంత్రాలు వెళ్ళి అక్కడే నూర్పిడి, తూర్పు ఒకేసారి జరిగిపోయి ధాన్యం నేరుగా సంచుల్లోకి వచ్చి చేరుతోంది.

ఇలా ధాన్యం సంచుల్లోకి చేరుతుందే కానీ, వాటిని తిరిగి ఇంటికి చేర్చడం లేదా ఆ ధాన్యాన్ని ఆరబోయటానికి గ్రామంలోని ఒక విశాల ప్రదేశానికి చేర్చటం, మళ్ళీ ధాన్యం ఆరిన తర్వాత సంచులకు నింపి నేరుగా ఇంటికో లేదా మార్కెట్‌కో తరలించే పని మాత్రం ఇప్పటికీ జరుగుతునే ఉంది. కానీ, ఇక్కడే ఒక సమస్య వచ్చి పడింది రైతాంగానికి.

పూర్వం చాలామంది కూలీలు బక్క పలచగా వున్నా ఎంతో శరీర దృఢత్వంతో వుండి 50 కిలోల ధాన్యం మూటను కూడా సునాయాసంగా ఎత్తి ఎద్దుల బండి లేదా ట్రాక్టర్‌పై వేసేవారు. ఇప్పుడు అలా ధాన్యం మూటలను ఎత్తి వాహనాల్లో వేసే శారీరక దృఢత్వం కలిగిన కూలీల



సంఖ్య 1–2 శాతానికి పడిపోయింది. వారి కూలీల ఖర్చు కూడా రైతుకు తడిసి మోపెడవుతోంది. స్వయంగా ధాన్యం మూట లు ఎత్తుకోలేక, కూలీల ఖర్చును భరించలేక సతమతం అవుతున్నారు సన్న, చిన్నకారు రైతులు.

అలాగే ఏవైనా బరువైన యంత్రాలు, వస్తువులు గ్రామాలకు తీసుకు వస్తే వాటిని దింపేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకు గురి అవ్వాల్సి వస్తోంది గ్రామీణులకు. పట్టణాల్లో ఎన్నో రకాల గిడ్డంగుల వద్ద హమాలీల లేమి కారణంగా లారీలకు అనుకున్న సమయంలో లోడు కాక, లారీల యజమానులు, సరుకు యజమానులు, గిడ్డంగి సిబ్బంది ఎంతో ఆవేదనకు గురవుతున్నారు. ఒక్కో గిడ్డంగి వద్ద ఒక క్రేన్ సిద్ధంగా వున్నట్లయితే అందరు సంతోషంగా వుండటంతో పాటు, యువతకు ఉపాధి కూడా లభిస్తుంది.

ఈ సమస్యలన్నిటిని తీర్చేందుకు ఒక సులువైన, ఎటువంటి నిర్వహణా ఖర్చు లేని పరికరాన్ని తయారు చేశాడు హనుమకొండ జిల్లా పర్కాలకు చెందిన ఇన్నోవేటర్ 'కడివెండి మహిపాల్ చారి'. ఈ పరికరాన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది. ఈ పరికరం ద్వారా కేవలం ముగ్గురు అంటే ట్రాక్టరు డ్రైవరు, రైతు, మరో కూలీ లేదా రైతు కుటుంబ సభ్యులు ఉంటే చాలు. ఎంతటి బరువైన ధాన్యపు బస్తాలు లేదా బరువైన యంత్రాలు, ఏ వస్తువులను ఐనా సరే ట్రాక్టర్‌లోకి ఎత్తటం, దించటం, మరో స్థలంలో ఉంచటం చాలా సులభంగా ఖర్చు లేకుండా చేసుకోవచ్చు.

**ట్రాక్టర్‌కు ధాన్యం, బరువులు ఎత్తడం లేదా దించడం:**

ధాన్యం బస్తాలకు అతి సమీపంలో ట్రాక్టర్ ట్రాలీని ఉంచి, ట్రాక్టర్ వెనక భాగంలో ఈ క్రేన్ అనుసంధానం చేసుకుంటాడు డ్రైవర్. మొదట ధాన్యం బస్తాలు నెట్టు వేసిన వద్దకు వస్తాడు అక్కడ వున్న రైతు ఆ క్రేన్‌కు వున్న తాడును బస్తాకు చుట్టి పెడతాడు. డ్రైవర్ దాన్ని క్రేన్ సహాయంతో తీసుకు వెళ్ళి ట్రాక్టర్ ట్రాలీలో దించుతాడు. అక్కడ ట్రాలీలో వున్న మరో వ్యక్తి ధాన్యం బస్తాకు వున్న తాడును తీసివేసి బస్తా ఎక్కడ నెట్టు వేయాలో అక్కడ సర్దుతూ వుంటాడు. ఈ మొత్తం పనికి సాధారణంగా పది మంది హమాలీలు ఎంతో శారీరక శ్రమతో చేయాల్సిన పని ఈ క్రేన్‌తో కేవలం ముగ్గురు వ్యక్తులు ఎటువంటి అలుపు లేకుండా పూర్తి చేస్తారు. ఇక్కడ ముగ్గురు వ్యక్తులు లేనిచోట కేవలం ఇద్దరు అంటే రైతు ట్రాక్టర్ డ్రైవర్ కూడా చేసుకోవచ్చు. కాకపోతే క్రింద ధాన్యం మూటకు తాడును కట్టే వ్యక్తే మళ్ళీ ట్రాలీలోకి ఎక్కి ఆ ధాన్యపు మూటను దించుకుంటాడు. తక్కువ బస్తాలు వున్నచోట, చిన్న, సన్నకారు రైతులు ఇలా చేసుకోవచ్చు. ట్రాక్టరుపైకి ధాన్యపు బస్తాలు, ఇతర బరువైన వస్తువులను ఎంత సులభంగా చేర్చవచ్చో తెలుసింది కదా, అలాగే దించటం కూడా సులువు అవుతుంది.





ఇక్కడ గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి ఏమింటంటే, ఈ క్రేన్‌ను ట్రాక్టర్ వున్న యువకులు కొనుగోలు చేసినట్లయితే మీ గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలలో కూడా బరువులు, ఎత్తే, దించే పనులను ఎటువంటి కూలీల ఖర్చు లేకుండా రైతుకు మేలు చేయటంతో పాటు, మీరూ ఉపాధి పొందవచ్చు. ప్రస్తుతం ఒక్కో ప్రాంతాన్ని బట్టి ఒక బస్తా ధాన్యం ఎత్తాలన్నా, దించాలన్నా (లోడ్ అన్‌లోడ్) ఒక్కో బస్తాకు 5 నుండి 8 రూపాయల కూలీ తీసుకుంటున్నారు. అదే ట్రాక్టర్ కలిగిన యువకులు ఈ పరికరం ఏర్పాటు చేసుకోవటం ద్వారా ఒక్కో బస్తాకు రెండు లేదా మూడు రూపాయలు తీసుకున్నా రైతు ఆనందంగా ఇస్తాడు. ఎందుకంటే ఇందుకు అయ్యే పదిమంది కూలీల ఖర్చుకన్నా మీకు అయ్యే ఖర్చు తక్కువ, పదిమందిని ప్రోగు చేసే పనికన్నా, మిమ్మల్ని ఒక్కర్నే ఏర్పాటు చేసుకోవటం సులభం, పైగా పని త్వరగా, అలుపు లేకుండా అయిపోతుంది.

కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు, పట్టణ, నగర ప్రాంతాల్లోని ట్రాక్టర్ యజమానులు కూడా ఈ పరికరం ఏర్పాటు చేసుకోవటం ద్వారా హమాలీ ఖర్చును సగానికి పైగా తగ్గించటంతో పాటు యువతీ యువకులు కూడా ఉపాధి పొందవచ్చు. ●

**పరికరం కావాల్సిన వారు సంప్రదించండి:**

**సుభాష్ చందర్ : 96528 01700**

**వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904.**

## సమాజానికి 'పల్లెసృజన' విజ్ఞప్తి

చుట్టూ ఉన్న సమాజంలోని కష్టాలను గమనించండి. ఆ కష్టాలను సంపూర్తిగా అవగాహన చేసుకొని వాటి నివారణకై సమాజంలో చర్చలు జరపండి. సరియైన పరిష్కారాన్ని ఇన్నోవేట్ చెయ్యండి. అది ప్రజలకు అందుబాటులో ఉండేట్లుగా, అవసరానికి తగ్గట్లుగా, వైవిధ్యానికి వాతావరణానికి తోడు చేసేట్లుగా ఉండాలి. ఇలాంటి ఇన్నోవేషన్లు ప్రజలకు చేరిస్తే ఈ దేశం నిజమైన ఆత్మ నిర్భరత ను సాధిస్తుంది. మీకు ఎటువంటి సాంకేతిక పరమైన అవసరాలున్నా 'పల్లెసజన' ను సంప్రదించ దానికి సంశయించకండి. సమస్య పరిష్కారానికి మీ ఆలోచనను తెలియజేసినా, అది కార్యరూపం దాల్చేలా చేద్దాం.

**- పల్లెసృజన.**




## హనీబీ నెట్‌వర్క్ సృజనాత్మక & సమ్మిళిత ఇన్నోవేషన్ పురస్కారాలు - ఇండియా

# HBNCRIIA - INDIA

సమాజానికి ఉపయోగ పడే ప్రత్యేకమైన సృజనాత్మకత మరియు ఆవిష్కరణల ద్వారా
భారత దేశాన్ని వినూత్నంగా మార్చడంలో ఇన్నోవేటర్ల సహకారానికి గుర్తింపును తీసుకు వచ్చేందుకు
మీ ఆవిష్కరణలను మాతో పంచుకోండి.
మీ సృజనాత్మకత / ఆవిష్కరణ గురించి మాకు తెలియజేయటానికి

దరఖాస్తు చేసుకోవటానికి చివరి తేది : 31 జనవరి, 2024.

పూర్తి వివరాల కొరకు సంప్రదించండి : పల్లెసృజన, 77 వాయుపురి, హైదరాబాద్ - 500 094. ఫోన్ : 9866 00 1678

**ఉద్దేశ్యాలు :**

- అన్ని రంగాల నుంచి 2,000 పునాది స్థాయి ఇన్నోవేటర్లను గుర్తించి, వాటిలో నుంచి 15 ప్రత్యేకమైన ఇన్నోవేషన్‌లను ఎంపిక చేసి వారిని జాతీయ స్థాయిలో జరగబోయే కార్యక్రమంలో సన్మానించటం.
- సామాన్య ప్రజలలోని సృజనాత్మకతను గుర్తించి, వారికి గుర్తింపు, గౌరవం, సత్కారం జరిగేలా చూసి, వారిని హనీబీ నెట్‌వర్క్‌లో భాగస్వాములను చెయ్యటం.
- ప్రత్యేకమైన సాంప్రదాయ జ్ఞానాన్ని గుర్తించి – దానిని అభివృద్ధి మరియు విలువ పెంచటానికి తోడ్పడి, భారీ స్థాయిలో వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయటానికి, స్వయం సమృద్ధి పద్ధతిలో సహకరించటం.

**అర్హత వివరాలు :**

- ఇన్నోవేషన్ ఏ ప్రాంతానికైనా/ రంగానికైనా/ వ్యవసాయ/ వ్యవసాయేతర ఉపయోగాలు, విద్య, వసతులు, సాంప్రదాయ జ్ఞానము, పర్యావరణం, స్త్రీల శ్రమ తగ్గించటం, జీవనోపాధి, అందుబాటులో ఉండటం – మొదలైనవి అయి ఉండాలి.
- వయస్సు, లింగభేదం, వర్గం, విద్యకు సంబంధించిన ఏ విధమైన ప్రతిబంధకాలు లేవు. ఎవ్వరైనా పాల్గొనవచ్చు.
- ఇన్నోవేషన్‌లు సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలకి దోహద పడేలా ఉండాలి.
- ఇన్నోవేషన్‌కి ఇంకా అభివృద్ధి చేయగలిగే అవకాశాలు ఉండాలి.
- ఇంతకు ముందు చిన్న స్థాయిలో ఆర్థిక సహాయం పొందిన, చిన్న బహుమతులు పొందిన ఇన్నోవేషన్‌లు కూడా పాల్గొనవచ్చు. కానీ, జాతీయ స్థాయి లేదా భారీ స్థాయిలో గుర్తింపు లేదా పెట్టుబడులు పొందిన ఇన్నోవేషన్‌లు పాల్గొనటానికి వీలు లేదు.

**బహుమతుల వివరాలు :**

జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన 15 మందికి బహూకరించ బడుతుంది.
❀ మొదటి బహుమతి : 5 లక్షల రూపాయలు ❀ రెండవ బహుమతి : 3 లక్షల రూపాయలు
❀ మూడవ బసుమతి : 2 లక్షల రూపాయలు ❀ 12 మందికి ప్రోత్సాహక బహుమతులుగా ఒక్కొక్కరికి రూ. 50,000/-
❀ గ్యాన్ ❀ అమెజాన్ వారు గుర్తించినట్లుగా ఒక ప్రశంసా పత్రం అందరికీ అందజేయబడుతుంది.




## దరఖాస్తు చేసుకోవటానికి చివరి తేది : 31 జనవరి, 2024.

మీ దరఖాస్తులను ఈ చిరునామాకు పంపండి...

Email : gian@gian.org
or post them to
GIAN, Bungalow No. 1,
Sattellite Complex, Nr. Mansi Crossroads,
Satellite, Ahmedabad – 380 015. Gujarat
Call us at : 079 26769686

**Last Date for Submission of Application : 31st January, 2024**

విశేషాలు

# నవంబర్ - డిశంబర్ 2023లో జరిగిన 'పల్లెసృజన' విశేషాల చిత్రాలు



2 నవంబర్, 2023న 'పల్లెసృజన' కార్యాలయంలో 'పెబెల్ క్రీక్, సికింద్రాబాద్' కు చెందిన విద్యార్థులతో జరిగిన ఒక సంధాన కార్యక్రమంలో వాలంటీర్ ఓంకార్ విద్యార్థులకు 'పల్లెసృజన' కార్యక్రమాలు, ఇన్నోవేషన్లు, ఇన్నోవేటర్ల ను గురించి వివరించడం జరిగింది.





25 డిశంబర్, 2023న కడప జిల్లాకు చెందిన 'సృజనాత్మక రైతు' విజయకుమార్ గారు 'సృష్టి సమ్మాన్' పురస్కారం అహమ్మదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అందుకోవడం జరిగింది. ఈ పురస్కారం 'హనీబీ నెట్‌వర్క్' ద్వారా అందజేయడం జరిగింది.










02 నవంబర్, 2023న తిరుపతి వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు మన ఇన్నోవేటర్లు గురుమూర్తి, బాబూరావు, కిషన్‌లు తమ ఇన్నోవేషన్లతో వ్యాపార అభివృద్ధి చేసుకోవటానికి నగదు పారితోషికాన్ని అందజేయటం జరిగింది.




30 అక్టోబర్, 2023న గుజరాత్ రాష్ట్రంలోని, అహమ్మదాబాద్‌లో జరిగిన 'అక్షయ్ కృషి పరివార్ అట్ నాలెడ్జ్ కన్సార్టియమ్' కార్యక్రమంలో 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం ప్రసంగించటం జరిగింది.


IIMA

IDEOS IIMA
Social Entrepreneurship Club

CERTIFICATE OF APPRECIATION

Presented to

SIVAKUMAR MODHA

for their exceptional performance in

INNOVATION PLAYGROUND

organised on December 17, 2023 at IIM Ahmedabad.

We congratulate them for securing 1st position and winning a prize of Rs 50,000

Ravi Sreedharan
Founder, ISDM

Meet Agrawal
Meena Creations

INNOVATION PARTNERS



17 డిశంబర్, 2023న 'ఐఐఎం' అహమ్మదాబాద్‌లో జరిగిన 'ఇన్నోవేషన్ ప్లే గ్రౌండ్' కార్యక్రమంలో మన ఇన్నోవేటర్ 'మోధా శివకుమార్' మొదటి బహుమతిగా ఎన్నికై రూ. 50 వేల నగదు పురస్కారం, ప్రశంసా పత్రం అందుకోవటం జరిగింది.



16 నవంబర్, 2023న హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన పర్యావరణ వేత్త 'కొమెర అంకారావు' (జాజి)కి "సాక్షి ఎక్సలెన్సీ పురస్కారం' ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ మరియు సాక్షి అధినేత్రి భారతి రెడ్డి గారి చేతులమీదుగా అందుకోవటం జరిగింది.









03-04 డిశంబర్, 2023 తేదీలలో 'అగ్రిటెక్-2023' జరిగింది. ఈ కార్యక్రమంలో మన పల్లెసృజన నుండి 6గురు ఇన్నోవేటర్లు హాజరై 18 ఇన్నోవేషన్లను ప్రదర్శించడం జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న ఇన్నోవేటరుంల ప్రదర్శించిన ఆవిష్కరణలను చూసి సందర్శకులు, అధికారులు మన్ననలు తెలియజేశారు.

# 'జి-20' 'సి-20' 'లైఫ్' అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశ సమ్మతులు



**లైఫ్ (LiFE)**
**పర్యావరణ రక్షణకై జీవన విధానం**
**(Lifestyle for Environment)**

పర్యావరణంపై మానవుల ప్రభావం తగ్గించడానికై అంతర్జాతీయంగా వివిధ స్థాయిలలో అనేక సంస్థలు, కూటములు పని చేస్తున్నాయి. తమతమ పరిధులలో పని చేసే ఈ వ్యవస్థలు వాతావరణ పాలనకి శాస్త్రీయ, ఆర్థిక, రాజకీయ రూపాలలో సహాయం అందిస్తాయి. ఈ నియంత్రణ వ్యవస్థల ఏర్పాటుకి, ఖర్చు చేసిన వనరులకి, శ్రమకి తగ్గ ఫలితాలు అందటం లేదు. కారణం తీసుకున్న నిర్ణయాలు, కల్పించుకున్న ఒప్పందాలు సరియైన పద్ధతిలో అమలు కావటం లేదు.

పెరుగుతున్న హరిత గృహ వాయువులు, హెచ్చు అవుతున్న భూగోళ ఉష్ణోగ్రత మరియు సముద్ర మట్టాలు, నియంత్రణ లేకుండా పోతున్న గాలి, నీరు, భూకాలుష్యం, మునుపెన్నడూ లేని విధంగా మారిపోతున్న జీవ వైవిద్యం, చెట్లు కనుమరుగై అనేక ప్రాంతాలు ఎడారులుగా మారటం లాంటివి అన్నీ కూడా భూగోళ పర్యావరణ సమస్యలకి లక్షణాలుగా మారుతున్నాయి. ప్రపంచ స్థాయిలో పనిచేసే అనేక సంస్థలు, నిర్వహించే సమావేశాలు ఈ లక్షణాలను తగ్గించడానికే ఉద్దేశించ బడినవి. ప్రపంచ వ్యాప్తంగా నిర్ణీత, ఖచ్చితమైన చర్యలు తీసుకోకపోతే ఈ లక్షణాలను నియంత్రించటం కష్టతరం అవుతుంది. ప్రజలు వ్యక్తిగతంగా, స్వచ్ఛందంగా మరియు సమూహాలుగా వారి జీవన విధానాలలో మార్పులు తీసుకు రాగలిగినప్పుడే ఈ పర్యావరణ సమస్యలు పరిష్కారం అవుతాయి.

**పర్యావరణానికై జీవన విధానం (లైఫ్) :** పర్యావరణానికై జీవన విధానం (లైఫ్) అన్నది సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అన్నిటిలో పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని చేసే సమకాలీన చర్యలతో ముడిపడి ఉంది.






భారత దేశం అనాదిగా పర్యావరణంపై సంపూర్ణ అవగాహన ఉన్న దేశం. భారత ఉపఖండం లోని ప్రజలు చారిత్రాత్మకంగా ప్రకృతితో మమేకమై జీవిస్తూ, పర్యావరణంపై తమ అవగాహనని మౌఖికంగా ప్రచారం చేస్తున్నారు. పర్యావరణానికై జీవన విధానం (లైఫ్), భారత దేశ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రతిపాదించి, వాతావరణ మార్పులు, పర్యావరణ పతనానికి సమాధానంగా "లైఫ్"ని ప్రపంచం ముందు ఉంచారు. దేశాలు, రాష్ట్రాలు అభివృద్ధి పేరుతో తీసుకుంటున్న విధాన నిర్ణయాలు ఈ వాతావరణ మార్పులు, పర్యావరణ రక్షణకై జరిగే చర్యలకు ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ఈ సవాలుకి సమాధానం కావాలంటే విలువలతో కూడిన విద్య, జీవన శైలి నుండి అభివృద్ధి పథం దాకా సమగ్ర దిశ కావాలి. భారత ప్రధాని దృష్టిలో 'లైఫ్' అంటే మన నడవడికలో మార్పు రావాలి. ప్రకృతిని గౌరవించాలి. వనరులని చాలా జాగ్రత్తగా ఆచి-తూచి వినియోగించాలి. మన అవసరాలను తగ్గించుకొని మితంగా జీవించటానికి అలవాటు పడాలి. ఇవన్నీ భారత సాంప్రదాయంలో భాగాలుగా ఉన్నా, ఈ ప్రయత్నాలు ప్రపంచ వ్యాప్తంగా జరగాలి. భారత ప్రధాన మంత్రి మోదీ గారు అన్నట్లు 'ప్రకృతిని గౌరవించడం (పూజించటం)' అన్నది అనాదిగా భారతీయ సంస్కృతిలో జీర్ణించుకు పోయిన అంశం. అదే విధంగా పర్యావరణాన్ని సంరక్షించుకోవాలి అన్న ఆలోచన భారతీయులకు సహజంగానే అబ్బిన విద్య. ప్రస్తుత తరం వెల కట్టలేని సహజ వనరుల సంపదకు, భవిష్యత్ తరానికి ధర్మకర్తలుగా వ్యవహరించాలి.

'లైఫ్' ప్రపంచ పర్యావరణ పరిపాలనకు రాజకీయంగా, ఆర్థికంగా, శాస్త్రీయంగా చేపట్టే చర్యలకి సహాయకారిగా ఉంటూ, చేదోడుగా పని చేస్తుంది. ఇది సుస్థిర అభివృద్ధి గమ్యాలతో (ఎస్‌డిజి) సంధానం చేయబడింది. సుస్థిర ఉత్పత్తి, వినియోగం యస్‌డిజి-12 పై ముఖ్యంగా పని చేస్తుంది. ఈ ఉత్పత్తి- వినియోగాలలో సుస్థిరతపై ప్రపంచ వ్యాప్తంగా ఈమధ్యనే 'ఇటలీ జి-20' అధ్యక్షతన యూరోపియన్ యూనియన్ వారు "సర్క్యులర్ ఫ్యాషన్" పేరిట 7 జూన్, 2021లో ఏర్పాటు చేసిన వెబినార్‌లో మొదటిసారిగా ప్రస్తావించబడింది. కానీ భారత దేశం ఈ పద్ధతిని కొన్ని శతాబ్దాలుగా ఆచరిస్తోంది.

వివిధ దేశాలకు చెందిన ప్రజా సంస్థలు తమ అనుభవ సారాన్ని క్రోడీకరించినపుడే ప్రపంచ పర్యావరణం అన్న అంశాన్ని విశ్వ వ్యాప్తంగా గుర్తించే పరిధిలోనికి తీసుకు రావటానికి వీలవుతుంది.

**'లైఫ్' పునాదులు :** పంచతత్వాలైన 'ఆకాశం, వాయువు, అగ్ని (శక్తి), నీరు మరియు భూమి' ఈ పృథ్వికి పునాదులుగా ఉన్నాయి. అధర్వణ వేదంలో విశ్వం పుట్టుకకు కారణం ఈ పంచతత్వాల కలయికే అని, అందులోనే ఈ ఐదు మూల తత్వాలపైనే మన మనుగడ ఆధారపడి ఉందని ఉల్లేఖించబడింది. **(సశేషం)**

# రైతు అవసరాలకు స్పందించిన ఇన్నోవేటర్

## తానే సృష్టించిన యంత్రాన్ని రైతు అవసరాలకు అనుకూలంగా మార్చిన ప్రవీణ్




- పల్లె వీరరాఘవ రెడ్డి

గత 'పల్లెసృజన' సంచికలో సిరిసిల్ల జిల్లాకు చెందిన 'కొడిముంజ ప్రవీణ్ కుమార్' పట్టు రైతులకు కూలీల వల్ల జరిగే ఆర్థిక భారాన్ని, కష్టాన్ని తగ్గించేందుకు తయారు చేసిన సరికొత్త ఇన్నోవేషన్ "మల్బరీ చెట్లను కత్తిరించే" ట్రాక్టర్ అనుసంధాన పరికరం గురించి పాఠకులకు తెలియజేశాము. ఈ పరికరం తయారీ చేయటానికి సిరిసిల్ల జిల్లాలోని రైతాంగం తమ సమస్యను ప్రవీణ్‌కు విన్నవిస్తే దానికి 'పరిష్కారం'గా తయారు చేసిందే ఈ పరికరం. దీని తయారీతో ఆ రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిశాయి. ప్రతి సంవత్సరం 30–40 వేల రూపాయల ఖర్చు తమకు ఆదా చేయటంతో పాటు, ఎటువంటి శ్రమ లేకుండా రోజుల తరబడి చేసే పనిని కేవలం గంటల వ్యవధిలో ఈ పరికరం చేసేలా తయారు చేసినందుకు ప్రవీణ్‌కు అభినందనలు తెలియజేశారు.

ఈ మల్బరీ సాగు చిత్తూరు జిల్లాలో ఎక్కువగా ఉంటుందని, అక్కడి ఇన్నోవేటర్ 'గురుమూర్తి' తో ప్రవీణ్‌ను అనుసంధానం చేసి, నీవు అక్కడికి వెళ్ళి ఈ పరికరం గూర్చి వివరించమని 'పల్లెసృజన' సూచించడంతో అతను చిత్తూరు జిల్లా పలమనేరుకు వెళ్ళటం జరిగింది. అక్కడి రైతుల పొలాలను పరిశీలించి, తాను తయారు చేసిన పరికరం యొక్క వీడియోలను చూపించాడు. ఆ ప్రాంతం రైతులు ఈ పరికరం గురించి మేము ఎంతో మంది ప్రభుత్వాధికారులతో ఎన్నో ఏళ్ళుగా మా సమస్యను విన్నవించడం జరిగింది, కానీ వారు చూపించలేని పరిష్కారం నువ్వు తయారు చేసి చూపించటం మాకెంతో ఉపశమనాన్ని ఇచ్చింది. ఈ పరికరం చాలా బాగా పని చేస్తోంది కానీ, మాకు ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయి, వాటిని కూడా ఈ పరికరం తీర్చేలా అభివృద్ధి చెయ్యమని కోరారు. మీ సమస్యలు ఏమిటని ప్రవీణ్ అడగటంతో, మీ సిరిసిల్ల ప్రాంత రైతులు కేవలం ఒకటి రెండు సంవత్సరాలకు ఒకసారి మల్బరీ చెట్లను పూర్తిగా తొలగిస్తారు. దానికి ఈ పరికరం చాలా బాగా పని చేస్తుంది. కానీ, మా ప్రాంతంలో మల్బరీ సాగు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి పట్టు పురుగులకు మేత వేసే పని కూడా ఎక్కువే. మాకు చెట్లను కత్తిరించటం మాత్రమే చేస్తే మళ్ళీ దాన్ని ప్రోగేసి, కట్టలు కట్టి పట్టు పురుగుల గోదాము వద్దకు తీసుకు వెళ్ళి వాటికి మేత వెయ్యాలి. అంటే ఈ కత్తిరించిన మొక్కలను, కట్టలుగా కట్టి, వాటిని అక్కడికి మోసుకు వెళ్ళి పురుగులకు మేత వెయ్యాల్సి ఉంటుంది. కనుక ఇదే పరికరానికి మల్బరీ మొక్కలను కత్తిరించటంతో పాటు, యంత్రమే కట్టలు కట్టే విధంగా అభివృద్ధి చేసినట్లయితే మాకు ఇంకా చాలా కూలీల ఖర్చు ఆదా అవుతుంది అన్నారు. మేము ప్రతి సంవత్సరం కనీసం 10 పర్యాయాలు ఇలా ఆకులను, కొమ్మలను కత్తిరించి, పురుగులకు వెయ్యాల్సి ఉంటుంది. ఇలా చేయటం వల్ల కూలీల ఖర్చు కనీసం సంవత్సరానికి ఎకరానికి 30 నుండి 40 వేల దాకా అవుతుంది. ఇక్కడి ప్రాంత రైతులు చాలా మంది 3–5 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. కాబట్టి ఇదే యంత్రాన్ని మాకు అవసరమైన విధంగా మల్బరీ మొక్కలను కత్తిరించటమే కక, కట్టలు కూడా కట్టే విధంగా తయారు చెయ్యమని అభ్యర్థించారు.

ఒక్కోసారి కూలీలు లభించక పట్టు పురుగులకు ఆహారాన్ని అందించలేని పరిస్థితి ఏర్పాడి చాలా నష్టపోతున్నాము. మా ఈ సమస్యకు పరిష్కారం చూపావంటే మేము ఇంకా ఎక్కువగా దిగుబడి సాధిస్తామని తెలియజేశారు పలమనేరు రైతులు. ఒక్కో గడిలో రెండు కట్టల మల్బరీ ఆకును వేస్తే, గంటల వ్యవధిలోనే వాటిని అవి తినేస్తాయి. ఒక్కోసారి సమయానికి వాటి ఆకలి తీర్చలేక మేము చాలా ఇబ్బందులు పడుతున్నాము అన్నారు. ఒక దశలో పట్టుపురుగులకి రోజుకు రెండుసార్లు కూడా ఆహారాన్ని అందించాల్సి వస్తుంది. ఆ సమయంలో పట్టుపురుగుల పెంపకం చేస్తున్న గోదాము పక్కన నిలబడి వింటే పట్టుపురుగులు మేత మేసే శబ్దాన్ని కూడా వినవచ్చు. అంత విపరీతమైన

తయారు చేసిన పరికరం వద్ద 'పల్లెసృజన' సభ్యుడు, ఇన్నోవేటర్, రైతులు



ఆబతో తిండి తింటాయి పట్టు పురుగులు. అటువంటి సమయంలో వాటికి తగిన ఆహారం అందించ లేకపోతే అవి రైతుకు మంచి దిగుబడిని అందించలేవు. కొన్ని పురుగులు ఆకలితో చనిపోయే అవకావం కూడా ఉంటుంది. కాబట్టి మేము కోరుకున్న విధంగా పరికరాన్ని రూపొందించి ఇస్తే, పది మంది కూలీలు చేసే పని కేవలం ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులతో, అతి తక్కువ సమయంలో ఎప్పటికప్పుడు తాజా ఆహారాన్ని పట్టు పురుగులకు అందించ గలము. అప్పుడు ఆ పురుగులు కూడా మాకు మంచి పట్టుగూళ్ళను తయారు చేసి ఇస్తాయి, మార్కెట్‌లో కూడా మంచి ధర లభించి, మేమంతా ఎంతో ఆనందంగా ఈ పట్టు వ్యవసాయం చేయ గలము. ఈ కూలీల లభించక, ఎక్కువ ఖర్చు భరించలేక కొందరు రైతులు పట్టు వ్యవసాయమే మానేస్తున్నారు. మా ప్రాంత రైతుల్లో చాలా మందికి పట్టు పురుగుల వ్యవసాయం తప్ప ఇతర పంటల సాగు గురించి పెద్దగా అనుభవం కూడా లేదట.

పలమనేరు ప్రాంత రైతుల సమస్యను అవగాహన చేసుకున్న ప్రవీణ్, ఇప్పటికే వరి పంటను కత్తిరించి, కట్టలు కట్టే పరికరం మార్కెట్‌లో అందుబాటులో ఉందని, ఆ పరికరాన్ని నేను తయారు చేసిన ఈ పరికరానికి అనుసంధానం చేస్తే మీ సమస్య సులభంగా తీర్చగలను. కానీ ఖర్చు కొంత ఎక్కువ అవుతుంది. ఎందుకంటే కట్టలు కట్టే పరికరాన్ని కొనుగోలు చెయ్యాలి, దాన్ని ఈ పరికరంతో సంధానం చెయ్యాల్సి ఉంటుంది. అందుకు అక్కడి 'శంకర రెడ్డి' అనే రైతు వెంటనే నీ సమస్య మాకు అర్థమైంది. ఇదిగో ఒక లక్ష రూపాయలు బయానాగా ఇస్తున్నాను, ఆ కట్టలు కట్టే పరికరాన్ని తెచ్చుకుని వెంటనే మా అవసరాన్ని తీర్చే పరికరం తయారు చెయ్యమని ప్రోత్సహించడం జరిగింది.

ఆ రైతు ఇచ్చిన ప్రోత్సాహానికి ముగ్ధుడైన ప్రవీణ్ మరునాడే హర్యానా రాష్ట్రానికి వెళ్ళి అక్కడ కట్టలు కట్టే ట్రాక్టర్ అనుసంధాన పరికరాన్ని కొనుగోలు చేసి తీసుకు వచ్చి, తను తయారు చేసిన కత్తిరించే పరికరంతో అనుసంధానం చెయ్యటానికి పూనుకున్నాడు. తన మొదటి ప్రయత్నంలోనే 60–70 శాతం పని పూర్తయింది. కానీ, 5 అడుగులకు పైగా ఎత్తు ఉన్న మల్బరీ మొక్కలను కత్తిరించి కట్టలు కట్టడం జరుగుతోంది కానీ, మొక్కలు ఎత్తుగా ఉండటం వల్ల కట్టబడిన కట్టలు ముందు వైపుకు పడటంతో పనిలో కొంత ఇబ్బంది తలెత్తింది. అదే మొక్కలు 2–3 అడుగుల ఎత్తుంటే కత్తిరించి, కట్టలు కట్టి వెనక వైపుకు విసిరి వేయటం జరిగింది. ఈ ప్రయోగాన్ని తిలకించేందుకు పరికరానికి బయానా ఇచ్చిన రైతు శంకర్ రెడ్డి, మరో రైతు చంద్రప్ప గౌడలతో పాటు 'పల్లెసృజన' బృందం కూడా వెళ్ళి గమనించటం జరిగింది. ఒక్క వారం



ఆకును వేగంగా మేస్తున్న పట్టు పురుగులు



పరికరం తో కత్తిరించి, కట్ట కట్టిన దాన్ని ఆనందంగా ఆస్వాదిస్తున్న రైతు

రోజులు సమయం ఇవ్వండి ఈ సమస్యను కూడా తీరుస్తాను. చిన్నపాటి సర్దుబాట్లు చేస్తే సరిపోతుంది. మీ అవసరానికి తగ్గట్టుగా యంత్రం తయారు చేసి ఇస్తాను అన్నాడు ప్రవీణ్.

ఆ తర్వాత వారం రోజుల్లోనే అవసరమైన సర్దుబాట్లు చేసి మళ్ళీ వీడియోలను రైతులకు పంపగా, వారు చాలా ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఈ వీడియోలను వాట్సయాప్ గ్రూపుల్లో పంపటంతో దాన్ని చూసిన కొందరు మరి రైతులు తమ కంది పంటను కత్తిరించి కట్టలు కట్టడానికి కూడా ఈ యంత్రం పనికి వస్తుందని తెలియజేయటం కొసమెరుపు.

లావణ్య అనే ఒక మహిళా రైతు 'పల్లెసృజన'కు ఫోన్ చేసి, మేము పశువుల గడ్డిని పెంచుతున్నామని, ఆ గడ్డి ఎత్తు 6 అడుగులకు పైగా ఉంటుంది, దాన్ని కత్తిరించి, కట్టలు కట్టేలా ఈ యంత్రాన్ని మార్పు చేస్తే తమకు ఎంతో మేలు చేసిన వారవుతారు అని తెలియజేసింది. మాలాగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది రైతులు పశువుల మేత కొరకు గడ్డిని పెంచి విక్రయించి, ఆదాయం పొందుతున్నారు. ఆ గడ్డిని కత్తిరించేందుకు కూలీల లేమి వల్ల ఖర్చు ఎక్కువ అవుతోంది కాబట్టి గడ్డి ఎక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది. ఈ యంత్రం తయారు చేసినట్లయితే మాకు ఖర్చులు తగ్గటంతో పాటు, పాడి రైతులకు తక్కువ ఖరీదుకే పశువుల మేత అందించే అవకాశం వస్తుంది అన్నారు.

అందుకు ప్రవీణ్ మల్బరీ మొక్కలు చాలా బలంగా ఉంటాయి, వాటినే కత్తిరించి కట్టలు కట్టేలా తయారు చేశాము. గడ్డిని కత్తిరించేలా పరికరాన్ని రూపొందించటం పెద్ద కష్టమేమీ కాదు, తయారు చేస్తాము అని తెలియజేశాడు.

ఇక్కడ పాఠకులు, ముఖ్యంగా రైతులు గమనించాల్సిన విషయం ఒకటుంది. అసలు ఈ పరికరం తయారు చెయ్యటానికి ఒక రైతు తన సమస్యను తెలియజేయగా, దానికి పరిష్కారం కనుగొన్నాడు ఇన్నోవేటర్ ప్రవీణ్. ఆ యంత్రాన్ని చూసిన మరో రైతు అదే పరికరాన్ని తమ సమస్యను తీర్చేలా అభివృద్ధి చెయ్యమని సవాలు విసిరాడు. దాన్ని కూడా తయారు చేసి చూపించాడు. ఈ మార్పు చేసిన పరికరం వీడియోను చూసిన మరి కొంతమంది రైతులు తమ కంది పంటకు అనువుగా ఉండేలా తయారు చెయ్యమని కోరటం, మరో రైతు పశువుల

మేతకు గడ్డిని కత్తిరించేలా అభివృద్ధి చెయ్యమని కోరటం జరిగింది. అంటే ఒక్క రైతుకు ప్రవీణ్ చూపిన పరిష్కారం ఇన్ని రకాల రైతులు తమ అవసరాన్ని తీర్చేలా పరికరం మార్పు చెయ్యమని కోరారు. వారి కోరికను మన్నించి ప్రవీణ్ వారి అవసరానికి అనుగుణంగా మూల యంత్రానికి అనేక మార్పులు చేసి, రైతుల అవసరాలను తీర్చాడు. ఇదే కదా 'పల్లెసృజన' గత 18 సంవత్సరాలుగా కలలు కంటోంది. సమస్య ఏదైనా సరే తమ మేధాశక్తినంతా ఉపయోగించి "సమస్య తెలిపితే, సవాలు స్వీకరించి, పరిష్కారం చూపే సామర్థ్యం పునాది స్థాయి (గ్రాస్‌రూట్స్) ఇన్నోవేటర్లకు" ఉందని నిరూపించాడు కొడిముంజ ప్రవీణ్ కుమార్.

ఇంత వరకు ఏ పేరుమోసిన సంస్థ చేయలేని విధంగా, ఇంత చవకగా, సమర్థవంతంగా సామాన్య రైతుకు కూడా అందుబాటులో ఉండేలా పరికరాన్ని తయారు చేసి, కోట్లాది రూపాయల్లో రైతుల పెట్టుబడి ఖర్చులను తగ్గించిన 'కొడిముంజ ప్రవీణ్'ను అభినందిస్తోంది 'పల్లెసృజన'. ఇంకా ఎన్నో ప్రజోపకరమైన సవాళ్ళను స్వీకరించి, వాటిని ప్రవీణ్ పరిష్కరిస్తాడని పల్లెసృజన నమ్ముతోంది. శిల్క్ బోర్డుతో


మల్బరీ మొక్కలను కత్తిరించి, కట్ట కట్టి విసిరి వేస్తున్న పరికరం

సంప్రదించి, తగిన సహాయాన్ని, గుర్తింపును ప్రవీణ్‌కు అందించాలని పల్లెసృజన ప్రయత్నిస్తోంది.

**ఇన్నోవేటర్ ప్రవీణ్, ఫోన్ : 88863 81657**

## స్వచ్ఛంద జ్ఞాన ప్రసరణ - అనుసంధాన కర్తగా స్కూలు విద్యార్థి

ఇటీవల (డిశంబర్ 3-4 తేదీలు) గుంటూరు వ్యవసాయ కళాశాల వారు ఏర్పాటు చేసిన 'అగ్రిటెక్-2023 లో జరిగిన ఒక సంఘటన 'పల్లెసృజన'కు ఆనందంతో పాటు ఆశ్చర్యాన్ని కలుగ జేసింది. ఆ ప్రదర్శనకు ఎంతోమంది రైతులు, ఔత్సాహికులు, అధికారులు విచ్చేసి, పల్లెసృజన ద్వారా వెలుగులోకి వచ్చిన 'రైతుల కొరకు రైతులు చేసిన ఇన్నోవేషన్లు' తిలకించడం జరిగింది. ఈ ప్రదర్శనకు విజయవాడలోని స్థానిక 'భాష్యం' పాఠశాల విద్యార్థులను ఆ పాఠశాల అధ్యాపకులు తీసుకు వచ్చారు. ఆ చిన్నారులు ప్రదర్శనను తిలకిచిన సందర్భంలో వారిలో ఒక విద్యార్థి 'పల్లెసృజనకు - రైతుకు అనుసంధానకర్త' గా మారిన సంఘటన ఒకటి జరిగింది. దాన్ని మీదృష్టికి తీసుకు వస్తున్నాం.

ఈ ప్రదర్శనలో మన ఇన్నోవేటర్ 'వెల్లె శ్రీనివాస్' తయారు చేసిన "మోటార్లకు రిమోట్ స్టార్టర్" ఆవుల హృషికేష్ మనస్సును ఆకట్టుకుంది. వెంటనే ఆ బాలుడు తన తండ్రి ఆవుల శ్రీనివాస రావుతో ప్రతిరోజూ మోటార్ ఆన్ చేయటం కోసం ఎంతో దూరం నడుచుకుంటూ వెళ్ళి రావాల్సి వస్తుంది కదా, దీన్ని తీసుకుని బిగించుకుంటే ఇక అంత దూరం నడిచి వెళ్ళాల్సిన అవసరం ఉండదు కదా, తన తండ్రికి ఎంతో శ్రమ తగ్గుతుంది అని ఆలోచించాడు ఆ చిన్నారి.

ఇంటికి వెళ్ళిన వెంటనే అతడు తన తండ్రితో తమ పాఠశాల విద్యార్థులందరూ కలిసి సందర్శించిన వ్యవసాయ ప్రదర్శన గురించి చెబుతూ అందులో 'మీకు పనికి వచ్చే ఒక పరికరం చూశాను నాన్నా, మీరు ప్రతిరోజూ మోటార్ ఆన్ చేయటానికి పొలం నుండి మోటారు వద్దకు చాలా దూరం నడుచుకుంటూ వెళ్ళి వస్తున్నారు, అందు వల్ల మీకు ఎంతో అలసట కలుగు




ఆవుల హృషికేష్


ఆవుల శ్రీనివాస రావు

తోంది కదా! ఈ సమస్యకు పరిష్కారం కనుగొన్నారు 'పల్లె సృజన' వారు. ఒక ఇన్నోవేటర్ ఈ సమస్య పరిష్కారానికి 'రిమోట్ స్టార్టర్' తయారు చేశాడు. మీరు దాన్ని తెప్పించుకుని, మన మోటారు వద్ద బిగించండి. ఇక మీరు ప్రతిరోజూ అంత దూరం కష్టపడి మో టార్ దాకా నడుచు కుంటూ వెళ్ళి స్టార్ట్ చేయాల్సిన అవసరం ఉండదు. నేరుగా పొలం దగ్గరకు వెళ్ళి అక్కడి నుండి రిమోట్ ఒత్తిన వెంటనే మోటార్ ఆన్ అవుతుంది. ఇదిగో వారి ఫోన్ నెంబర్ అంటూ అతను 'పల్లెసృజన' స్టాల్‌లో తీసుకున్న ఫోన్ నెంబరు తన తండ్రింకి ఇవ్వటం జరిగింది.

ఆ తండ్రికి తన కొడుకు తన గురించి ఆలోచించటం ఎంతో ఆనందం అనిపించి, వెంటనే ఆ నెంబర్‌కు ఫోన్ చెయ్యగా, పల్లెసృజన వాలంటీర్ 'ఉప్పుతేళ్ళ కృష్ణ' ఆ ఫోన్ ఎత్తి, అతనితో సంభాషించడం జరిగింది. ఆ రైతు కృష్ణతో "మా అబ్బాయి ఈ రోజు ఎగ్జిబిషన్‌లో మీ రిమోట్ స్టార్టర్‌ను చూశాడట, నాతో చెప్పాడు. నాకు దాని గురించిన వివరాలు తెలియమని" అన్నాడు. అందుకు కృష్ణ వెంటనే "మీరు అలాగే లైన్‌లో ఉండండి, నేను ఆ ఇన్నోవేటర్‌తో 'కాన్ఫరెన్స్ కాల్' ఏర్పాటు చేస్తాను" అని ఇన్నోవేటర్ 'వెల్లె శ్రీనివాస్'తో సంధానం చెయ్యటం జరిగింది. ఆ రైతు శ్రీనివాస్ చెప్పిన వివరాలు విని వెంటనే ఆ రిమోట్‌ను కొనుగోలు చేశాడు.

మనకు ఉపయోగ పడేది, మనసుకు నచ్చే వాటిని ప్రతి ఒక్కరూ ఆ పరికరం అవసరం ఉన్నవారితో సంధానం చెయ్యాన్న అవసరాన్ని ఒక స్కూలు కుర్రాడు నిరూపించాడు. ఇదే కదా 'పల్లెసృజన' కోరుకుంటోంది. పాఠశాల విద్యార్థులు కూడా ఒక్కసారి పల్లెసృజనతో పరిచయమైతే, వారు కూడా పల్లెసృజన వాలంటీర్లుగా మారుతారు అన్న విషయం తెలుసుకుని ఎంతో సంతోషం వేసింది. ఇలా మనిషి నుంచి మనిషికి ఇన్నోవేషన్లు సమాజానికి చేర్చడంలో 'వాలంటరీ' పద్ధతి ఉత్తమమైన మార్గమని మరోసారి నిరూపితం అవడంతో 'పల్లెసృజన' ఎంతో ఆనందానికి గురైంది.

# పల్లె జ్ఞానం

311210

**పాడి పశువులలో వచ్చే పొదుగువాపు వ్యాధికి గృహ వైద్యం:**

పాడి పశువులలో అరుదుగా సోకే 'పొదుగువాపు వ్యాధి' సరైన సమయంలో సరియైన చికిత్స చేయకపోతే పశువుకే ప్రమాదంగా పరిణమిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువు పొదుగు వాచిపోయి భరించరాని నొప్పితో కదలలేక, నించోలేని పరిస్థితి ఏర్పడుతుంది. పాలలో చీము, నెత్తురు కూడా వస్తాయి. ఈ వ్యాధికి గుజరాత్‌కు చెందిన సబర్‌కాంత జిల్లాలో నివసించే దీశా తాలూకాకు చెందిన 'వల్లభాయ్ బేచార్ భాయ్ పార్మర్' అనే రైతు సాధారణంగా ఇంట్లోనే దొరికే వస్తువులతో చక్కటి మందు కనిపెట్టాడు. ఈయన కేవలం అరటి కాయలు, నిమ్మకాయలతో ఈ వైద్యం చేస్తూ వుంటాడు.

ఈయన 2 కిలోల అరటి కాయలు ఒక కిలో నిమ్మకాయలు, 50 గ్రాముల స్ఫటిక తీసుకొని అన్నింటినీ కలిపి మెత్తగా రుబ్బి ఆ మిశ్రమాన్ని రోజుకు రెండుసార్లు పశువుకు తినిపించాలి. ఇలా మూడు చేస్తే మంచి ఫలితం వుంటుందని చెబుతున్నారు.

311211

**పశువులలో పారుకునే వ్యాధి నివారణకు మూలికా వైద్యం:**

సాధారణంగా వర్షాకాలంలో కొన్ని రకాల గడ్డి మొక్కలు తిన్నపుడు పశువులు పేడ గట్టిగా వేయక పారుకోవడం (విరోచనాలు) రైతులు సాధారణంగా గమనిస్తునే వుంటారు. దీనికి మార్కెట్‌లో రకరకాల మందులు వున్నప్పటికీ గుజరాత్‌కు రాష్ట్రంలోని 'ఆరావలి' జిల్లా, మేఘరాజు తాలూకా, మూన్శివాడి ప్రాంతానికి చెందిన 'రాంజీ భాయ్ భేమాజీ భాయ్ పరమార్' అనే రైతు అందరికీ అందుబాటులో వుండే చిట్కా ఒకటి తెలియజేస్తున్నాడు.

దీనికి ఆయన 'మారేడు' చెట్టు ఆకులు చాలు అంటాడు. ఒక కిలో మారేడు చెట్టు ఆకులు తీసుకొని, మెత్తగా దంచి, రెండు లీటర్ల నీటిలో బాగా కలిపి కొద్దిసేపటి తర్వాత వడకట్టి ఒక్కొక్క లీటర్ చొప్పున రెండు మూడుసార్లు తిగిస్తే పశువు పారుకోవడం తగ్గిపోతుంది అంటాడీయన.

311215

**కీటకాల నుండి పంట సంరక్షణ కొరకు ప్రకృతి చిట్కా:**

ప్రపంచంలో ప్రకృతి చాలా విచిత్రమైనది. పంటలనిచ్చింది. పంటలను పురుగుల నుండి రక్షించడానికి మూలికలను కూడా ప్రకృతే ఇచ్చింది. ఉదాహరణకి హిమాచల్ ప్రదేశ్ 'కులు' ప్రాంతానికి చెందిన 'సేతూరాం' అనే రైతు తన స్వానుభవం చెబుతున్నాడు. ఆయన తన పొలానికి హాని చేసే కీటకాల నుండి రక్షణ పొందటం కోసం 'బంగు' ఆకులను ఎండబెట్టి, వాటిని పొడి చేసి, దానిలో బంగు గింజల నుండి తీసిన ఒక లీటర్ నూనెలో కలిపి ఎండ వున్నపుడు పంటపై పిచికారి ఎటువంటి పురుగైనా చనిపోతుంది అంటాడు.

311217

**పంటలను ఆశించే కీటకాల నివారణకి సులభమైన మూలికా పురుగు మందు:**

రైతు పంట వేయటం ఒకయెత్తయితే, దానిని వివిధ రకాల కీటకాల నుండి రక్షించుకోవడం మరోయెత్తు అవుతోంది. మార్కెట్‌లో వివిధ రకాల కీటకాలకి ఎన్నో రకాల మందులు అందుబాటులో వున్నాయి. అలా అవసరం లేకుండా మనకు అందుబాటులో వుండే ఒకే మూలికతో పురుగులు కీటకాల నుండి పంటలకి రక్షణ కల్పించవచ్చు అంటాడు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం లోని కులు ప్రాంతం లోని 'మర్షూన్'లో నివసించే "చేత్‌రామ్" అనే రైతు.

ఈయన "వస" దుంప లేక కొమ్ములను మెత్తటి పొడిగా చేసుకుని, ఒక లీటర్ నీటికి 10 గ్రాముల పొడి చొప్పున కలిపి పంటలపై బాగా ఎండగా వున్నపుడు పిచికారి చేస్తే ఏ పంటనైనా ఆశించే దాదాపు అన్ని రకాల కీటకాలు నశిస్తాయి. తెల్లదోమ, పచ్చదోమ లాంటివి కూడా పంటలను ఆశించవు అంటాడీయన. ఈ పద్ధతిని ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లాలో విరివిగా వాడుతున్నట్లు తెలుస్తోంది.

311029

**ఆకుముడత నివారణకు వంటింటి చిట్కా:**

ఆకుముడత తెగులు సాధారణంగా చాలా రకాల పంటలకు వస్తుంది. ముఖ్యంగా మిరప పంట పండించే రైతులకు ఇది పెద్ద తలనొప్పిగా తయారైంది. ఈ తెగులు సోకిన మొక్క ఎదుగుదల లేక క్షీణించి, క్రమేపీ నశించిపోతుంది. దీన్ని నివారించడానికి మార్కెట్‌లో చాలా రకాల మందులు ఉన్నా అవన్నీ రసాయన కీటక నాశనులు కనుక మొక్కకు ఎంత మేలు చేస్తాయో ఆ పైన పర్యావరణానికి మనుషులకు కూడా ఎంతో కీడు చేస్తాయి. ఈ తెగులు నివారణకు గుజరాత్ రాష్ట్రంలో చాలా సులువైన వంటింటి చిట్కాను వాడుతారు.

ఒక లీటరు ఆవు పాలలో 50 గ్రాముల పసుపును బాగా కలిపి, కొంతసేపటి తర్వాత మొక్కలమీద పిచికారి చేస్తే చాలా మంచి ఫలితం వుంటుంది. దీనికి అనుభవజ్ఞులు జోడించిన మరొక చిట్కా ఏమిటంటే, పసుపును పాలలో కలిపే ముందు నీటిలో కలిపి వడట్టిన తర్వాత ఈ ద్రావకాన్ని పాలలో కలిపి పిచికారి చేయాలి.

21101



**పశువుల్లో నులిపురుగుల నివారణకు:**

పశువుల పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ప్రేవుల్లో నులి పురుగులు ఏర్పడి అవి తిన్నది అరగక బాధపడుతూ వుంటాయి. అశ్రద్ధ వహిస్తే పశువు క్రమంగా క్షీణించి మరణించే ప్రమాదముంది. పశువులలో నులి పురుగుల నివారణకు బజార్లో చాలా మందులు దొరుకుతున్నాయి. కానీ గుజరాత్ రాష్ట్రం, బరూచ్ జిల్లా, కంబూడి రైతు 'పుల్జీభాయ్ ఉమార్ భాయ్ వాస్వా' మన పెరట్లో దొరికే చెట్లతోనే వీటికి ఉత్తమమైన చికిత్స అందించవచ్చు అంటున్నారు. ఈయన పద్ధతి ప్రకారం 100 గ్రా. వేపాకులు, 100 గ్రా. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో కలపాలి. ఒక గంట తర్వాత ఆ మిశ్రమాన్ని బాగా కలిపి రోజుకు ఒకసారి చొప్పున రెండు మూడు రోజులు పశువు చేత తాగిస్తే నులి పురుగుల నుండి నివారణ పొందవచ్చు.

21102

**పంటలలో రసం పీల్చే పురుగుల నివారణకు:**

ఈ రసం పీల్చే పురుగు ఏ పంటకైనా, మొక్కకైనా సోకి చెట్టు ఆకులలోని రసాన్ని పీల్చేసి మొక్కలను నిర్వీర్యం చేసి అవి నశించిపోయేలా చేస్తాయి. వీటి నివారణకు గుజరాత్‌కు చెందిన 'పరుషోత్తమ్ భాయ్' చక్కటి, తేలికైన ఉపాయం చెపుతున్నాడు. ఈయన చాలాకాలంగా తన పొలంలో ఇదే పద్ధతిని వాడుతున్నాడట. ఈయన వేపాకులు, మజ్జిగ తేటను ఉపయోగించి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. వేపాకుల ను నీటిలో వేసి ఆ నీరు మూడవ వంతుకు వచ్చే వరకు మరగబెట్టి, 200 మి.లీ. ఆ కషాయాన్ని తీసుకుని, 1500 మి.లీ. మజ్జిగ తేటలో కలిపి పొలాలపై పిచికారి చేస్తే ఈ రసం పీల్చే పురుగు నుండి నివారణ పొందవచ్చు.

21103

**వెల్లుల్లి పంటను చీడనుంచి కాపాడటానికి:**

గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'పరుషోత్తమ్ భాయ్' ఈ ఉపాయం కూడా చెబుతున్నారు. భారత సుగంధ ద్రవ్యాల బోర్డు లెక్కల ప్రకారం 2002-2007 మధ్యలో గుజరాత్ రాష్ట్రంలో వెల్లుల్లి ఉత్పత్తి 480 శాతం పెరిగింది. ప్రత్యేకించి జునాగఢ్ జిల్లాలో అత్యధికంగా వెల్లుల్లి పండిస్తుంటారు. ఆ జిల్లాలోని రైతులు వెల్లుల్లి పంటను కాపాడ టానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్నిచ్చే సేంద్రియ పద్ధతిని పాటిస్తు న్నారు. దాన్ని పరుషోత్తమ్ భాయ్ మనకు తెలియజేస్తున్నారు. మజ్జిగ, గోమూత్రము, కుళ్ళిపోయిన సజ్జలపిండి ఈ మూడింటిని బాగా కలిపి వెల్లుల్లి పంటపై పిచికారి చేసి పంటను చీడల నుండి రక్షించుకోవచ్చు.

ఇంకొక రైతు 'రమేష్ భాయ్' మరో పద్ధతి వాడి తన వెల్లుల్లి పంటను చీడనుండి కాపాడుకుంటున్నాడు. ఆయన ఆముదము, నీరు, బట్టలుతికే సోడను కలిపి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఒకటి న్నర లీటర్ల ఆముదము, 100 గ్రా. బట్టలుతికే సోడ, 20 లీటర్ల నీటిలో కలిపి పంటకు నీరు పెట్టిన తర్వాత రెండు మూడు సార్లు పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుందని చెపుతున్నారు.

21104

**మిపర పంటను తెగుళ్ళనుండి కాపాడటానికి:**

గుజరాత్‌కు చెందిన 'పరశురామ్ భాయ్' ఈ చిట్కా కూడా చెపుతున్నారు. మిరప పంటను తెగుళ్ళ బారినుండి రక్షించుకోవటానికి ఆయన నిమ్మ, కలబంద, పొగాకులను కలిపి వాడుతుంటాడు. ఆయన 2 కిలోల పొగాకు పొడి, 2 కిలోల కలబంద, 250 గ్రా. నిమ్మరసం లను 20 లీటర్ల నీటిలో కలిపి మరిగిస్తాడు. 250 మి.లీ. ఈ ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి 8 రోజులకొకసారి మిర్చి పంటపై పిచికారి చేస్తాడు. ఈ పద్ధతి వలన మిరప పంటలో 80 శాతం వరకు తెగుళ్ళను నివారించ గలిగానని చెపుతున్నాడు.

21107

**వరి, మినుము పంటలలో చీడల నివారణకు:**

వరి మినుము పంటలను చీడలు సోకి చాలా నష్టాన్ని కలిగిస్తుంటాయి. దీని నివారణకు అనేక ఖరీదైన రసాయన పద్ధతులు వాడినా స్వచ్ఛమైన సేంద్రియ పద్ధతి ఒకటి వుంది అంటున్నారు గుజరాత్ రాష్ట్రం లోని బనస్కాంత ప్రాంతానికి చెందిన 'జమాల్ భాయ్ నూరాభాయ్ మోడీ'. ఈయన పులికంప చెట్టు ఆకులు, పొగాకు, రేలకాయలు (రోడ్ల పక్కలో విరివిగా లభించే నల్లని పొడగాటి కాయలు, ఈ చెట్ల పూత పసుపు వర్ణంలో వుంటుంది) ను కలిపి తయారు చేసుకుంటాడు. రెండు లీటర్ల ద్రావకం తయారు చేసుకోవటానికి ఆయన 200 గ్రా. పులికంప ఆకులు మరియు పూలు, 200 గ్రా. పొగాకు చెట్టు వేర్ల పొడి, 200 గ్రా. రేల కాయల పొడిని మూడు లీటర్ల నీటిలో కలిపి ద్రావకం 2 లీటర్లు అయ్యేంత వరకు మరగబెట్టాలి. ఈ కషాయాన్ని నీటిలో కలిపి పంటలపై పిచికారి చేస్తే మంచి ఫలితముంటుంది.

**బెండ పంటను చీడ పీడల నుండి కాపాడటానికి:**

గుజరాత్ రాష్ట్రంలోని సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, మాయానగర్ గ్రామ నివాసి 'జనక్ కుమార్ వ్రజిలాల్ చోహాన్' తన బెండ పంటను చీడ పీడలనుంచి కాపాడటానికి స్వయంగా ఓ పద్ధతిని కనుగొన్నాడు. ఈయన మెంతుల పొడిని ఉపయోగించి, ఒక ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఇది వాడటం వలన మంచి ఫలితం వుంటుంది అని చెపు తున్నారాయన. దీనికై ఆయన మెంతులను మెత్తగా నూరి పొడి చేసుకుని, ఒక కిలో పొడిని నీటిలో కలిపి మూడు రోజులపాటు మురగ బెడతాడు. మూడు రోజుల తర్వా త ఈ పొడి కొంత చిక్కగా, జిగురుగా మారుతుంది. ఆ చిక్కటి ద్రావకాన్ని మెత్తని చీపురుతో పంటపై చిలకరిస్తాడు. ఈ మెంతులకి వున్న ప్రత్యేకమైన వాసన చీడపీడలను, పురుగులను మొక్కల దగ్గరికి రానీయదు.

**మీ చిట్కాలను 'పల్లెసృజన'కు తెలియజేయండి**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇటీవల సేంద్రియ వ్యవసాయం బాగా అభివృద్ధి చెందుతోంది. ఈ విధానంలో మీరు కూడా ఏవైనా వినూత్న పద్ధతులను పాటించి, మీ పంటలను రక్షించుకున్న విధానం, మీ పశువులకు చేసిన వైద్య వివరాలను 'పల్లెసృజన'తో పంచుకోండి. వాటిని మన పత్రికలో ప్రచురిస్తాము. వాటిని ఇతర రైతులు కూడా ఆచరించి, తాము కూడా లాభం పొందుతారు. ఈ విధంగా మీరు అందించిన చిట్కాలు సమాజానికి ఎంతో ఉపయోగ పడటంతో పాటు, వారికి ఆర్థికంగా మానసికంగా లాభాలను చేకూరుస్తాయి. -ఎడిటర్

'హనీబీ నెట్‌వర్క్', 'పల్లెసృజన' ల ద్వారా వెలుగులోకి వచ్చిన

## 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న సామాన్యులు

## Padmashri Awards

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

# మహిళల మొహాల్లో ఆనంద 'పద్మా'లను వికసింపజేసిన 'పద్మశ్రీ' అరుణాచలం మురుగనాథమ్

- జమ్మలమడక శశిమోహన్




ఎన్ఐఎఫ్ ద్వారా రాష్ట్రపతి పురస్కారం - 2009



పద్మశ్రీ పురస్కారం - 2016

తమిళనాడు కోయంబత్తూరు జిల్లాలోని 'పూడూరు' ప్రాంతానికి చెందిన అరుణాలం మురుగనాథమ్ ఒక పేద కుటుంబానికి చెందిన వ్యక్తి. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పెద్దగా చదువుకో లేదు. తన 14వ ఏటనే చదువు ఆపేశాడు. వ్యవసాయ కూలీగా, వెల్డర్‌గా చిన్న చిన్న పనులు చేసుకుంటూ భుక్తి గడుపుకుంటూ ఉండేవాడు. ఇటువంటి సామాన్య వ్యక్తి దేశ స్థాయిలో 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించబడటానికి కారణం, ఇతరుల కష్టాలను చూసి స్పందించి, వారికి సహాయం చెయ్యాలని తపించే మనస్సు ఇతనికి ఉండటమే.

తనవద్ద డబ్బు లేకపోయినా, ఇతరులకి సహాయం చెయ్యాలన్న గొప్ప మనస్సున్నది కనుకనే, 'టైమ్స్' పత్రిక ప్రపంచంలోని చాలా పలుకుబడి కలిగిన వ్యక్తులలో ఒకరిగా 2014లో ఇతన్ని ఎంపిక చేసింది. హనీబీ వారు 2000 సం.లో ఇతనికి జాతీయ స్థాయిలో పురస్కారం ఇచ్చి సత్కరించారు. తరువాత 'పద్మశ్రీ' పురస్కారం, ఇంకా ఎన్నో....

ఈ ప్రస్థానానికి 1998లో నాంది పడిందని చెప్పొచ్చు. అప్పుడే అరుణాచలానికి 'శాంతి'తో వివాహం జరిగింది. పెళ్ళయిన కొత్తలో తన భార్య దృష్టిలో చాలా తెలివైన వాడనిపించుకోవాలన్న సహజ లక్షణం అతనికీ ఉంది. ఈ లక్షణమే ప్రతి పల్లెటూరులో అందరు మహిళలు మెచ్చుకొనేలా చేసింది. అతని జీవిత చరిత్రని, అగ్ర తారలను పెట్టి చలన చిత్రంగా తీసేలా చేసింది. ఈ చిత్రం అనేక భాషలలోకి అనువదించి ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శించబడింది. అశేష జనం మెప్పు పొందింది. (2017లో ట్వింకిల్ ఖన్నా నిర్మాతగా, ఆర్. బాల్కి దర్శకత్వంలో అక్షయ్‌కుమార్ ప్రధాన పాత్రగా నిర్మితమైన 'ది పాడ్ మాన్' చిత్రం).

ఈ కథకి మూలం చిన్న సందర్భంతో ప్రారంభం అయ్యింది. ఇతనికి పెళ్ళయిన కొత్తలో ఈయన భార్య స్నానాల గదిలోంచి చేతులు వెనక్కి పెట్టుకొని ఏదో దాచుకొంటూ బైటకి రావటం గమనించి, సరదాగా ఏంటో నాకు తెలీకుండా దాచుకొంటున్నావు అని అడిగాడు. నీకు సంబంధించింది కాదులే అని ఆమె త్వరత్వరగా వెళ్ళిపోయింది. ఏంటి అని అతడు తరచి తరచి అడిగి బహిష్టు సమయంలో స్త్రీలు వాడే మైలబట్ట అని తెలుసుకున్నాడు. ఇది అప్పుడు ఇప్పుడు కూడా బహిరంగంగా మాట్లాడుకునే విషయం కాదు. ఇంతకన్నా ఆరోగ్య కరమైన మంచి మార్గం లేదా? అని అడిగితే, అతను తన భార్య నోటినుంచి 'ఉన్నా, అవి చాలా ఖరీదైనది (సానిటరీ పాడ్స్) ఆరోగ్య రుమాలు వాటిని బజార్లో అమ్ముతారు కానీ, అవి సామాన్యులకు అందుబాటులో ఉండవు అని తెలుసుకొన్నాడు. తన భార్యే కాదు, ప్రపంచంలో చాలా దేశాలలో పేద మహిళలు ప్రతి మాసం నెలసరి సందర్భంలో 4–5 రోజులు ఈ విధంగా ఋతుస్రావం ఆగాలంటే పాత బట్టలు వాడుతారని, మన భారత దేశంలోనే కొన్ని కోట్ల మంది ఈ విధంగా మౌనంగా ఈ ఖర్చు పెట్టుకోలేక బాధపడుతున్నారని



తెలుసుకొన్నాడు. ఆడవాళ్ళ సమస్య బైటకి చెప్పుకోలేని సమస్య, అందరూ పడే సమస్య. మనదేశంలో కేవలం 15% మంది ఆడవాళ్ళకి మాత్రమే ఈ సానిటరీపాడ్స్ కొనుగోలు చేసే స్తోమత ఉంది. మిగిలిన 85% మంది అలా పాత బట్టలు వాడి అనారోగ్య పరిస్థితిలో ఉండాల్సి వస్తోందని గ్రహించాడు. వాటికని ఖర్చు పెడితే ఇతర ఖర్చులు, చివరికి పసిపిల్లల పాల ఖర్చు కూడా తగ్గించుకోవాల్సి వస్తుంది. ఇవన్నీ అతను తన భార్య వద్దనుంచి తెలుసుకున్నాడు. తరువాత అతను చేస్తున్న ప్రయోగాలలో మన దేశంలో 70% పురిటి సమయంలో వచ్చే రోగాలు ఈ అనారోగ్యకరమైన, అశౌచమైన పద్ధతులు వాడటం వలననే అని వైద్యుల ద్వారా తెలుసుకొని ఆశ్చర్యపోయాడు. ఇంత గంభీరమైన సమస్యని ఎవ్వరూ, ఏ ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు పట్టించుకోలేదని బాధ పడ్డాడు.

ఒక మంచి బాధ్యతగల భర్తగా తన భార్య స్వంతంగా ఉపయోగించుకోవటానికి శానిటరీ నాప్‌కిన్ పాకెట్ కొనుక్కొని వచ్చాడు. అప్పుడు మొదటిసారి అది ఎలా ఉంటుందో గమనించాడు. ఒకటి చించి చూసి, అది ఏవిధంగా తయారయిందో పరిశీలించాడు. కేవలం 10 పైసల విలువగల దూది వాడి 40 రెట్లు అధిక ధరకి అమ్ముతున్నాయి పెద్ద కంపెనీలు. పైగా ఈ విధంగా బజారునుంచి కొనుక్కొని వస్తే తమ పిల్లలకి పాలు కొనటం తగ్గించాల్సి వస్తుంది అని గుర్తు చేసింది అతని భార్య . అప్పుడు అతను ఈ ప్యాడ్‌ను నేనే తయారు చేస్తాను. ఇంట్లోనే తయారు చేసి నా భార్యను సంతోష పెడతాను అని నిర్ణయించుకున్నాడు.

తను చూసిన దాని ప్రకారం చాలా సులభం అనుకొని కొంత దూది, పాత బట్టలు తీసుకొని బజారులో దొరికే వాటిమాదిరే అదే సైజుకి కత్తిరించి సన్నని బట్టలో చుట్టి, ఇది వాడి నీ అభిప్రాయం చెప్పు అని తన భార్యకిచ్చాడు.

ఆమె అవి వాడి ఇవి చెండాలంగా ఉన్నాయి, ఏ విధంగా కూడా పనికి రావు అని చెప్పింది. ఇతను ఏదో చెప్పబోతే, నువ్వేం చెప్పనవసరం లేదు ఇది ఆడవాళ్ళ సమస్య నేను అలవాటు ప్రకారం పాత బట్టలనే వాడుకొంటాను అన్నది.

ఈ పాడ్‌ల స్థానంలో బట్టలు వాడటం సమాజంలో ఎంత నున్నితమైన విషయం అంటే వాటిని శుభ్రపరచటానికి ఉతికి బహిరంగంగా ఆరవేయడానికి కూడా లేదు.

మురుగనాథం తీవ్రంగా ఆలోచించటం మొదలు పెట్టాడు తను తయారు చేసిన దానికి, బజారులో దొరికే దానికి తేడా ఏమిటా? అని. ఎన్నో రకాల ముడి పదార్థాలను ఉపయోగించి రకరకాల 'పాడ్'లు చేసేవాడు. ఇక్కడ అతనికి తన భార్య ద్వారా వాటిని పరీక్షింపజెయ్యాలి అంటే నెల దాకా వేచి ఉండవలసి వస్తుంది. త్వరగా ఫలితాలు బేరీజు





వెయ్యాలి అంటే అతనికి ఇంకొకరు కావాలి. సోదరిని ఒప్పించాడు. అయినా అది బాగా లేవనే వారే తప్ప ఎందుకు బాగా లేవని చెప్పలేని పరిస్థితి వాళ్ళది.

ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తను చేసే 'పాడ్'లని వాడి, అభిప్రాయం చెపుతారా అని వెతకసాగాడు. తన ఇంటికి దగ్గరగా ఉన్న మెడికల్ కాలేజీ విద్యార్థినులను అడిగాడు. తాను తయారు చేసిన పాడ్‌లు వాడి అవి ఏవిధంగా పని చేస్తున్నాయో చెప్పండి అని. వారిలో కొందరు ముందుకు వచ్చి, వాడి, బాగా లేవని చెప్పారే కానీ, ఏ విధమైన ఇబ్బంది ఉందో పరాయి మగవాని ముందు చెప్పలేక పోయారు. పోనీ మీరు వాడేసినవి నాకివ్వండి, నేను వాటిని పరిశీలించి ఎక్కడ పొరపాట్లు జరుగుతున్నాయో, ఎక్కడ మార్పులు చెయ్యాలో చూసుకుంటాను అన్నపుడు, "ఛీ!" అని చేసే సహాయం కూడా చెయ్యటం మానేశారు.

చివరికి ఏం చెయ్యాలనే పరిస్థితుల్లో తానే స్వయంగా పరీక్షించాలని నిర్ణయించుకున్నాడు. ఒక కృత్రిమ గర్భసంచి లాంటి రబ్బరు తిత్తి తయారు చేసుకుని దానిలో జంతువుల రక్తం నింపి, దానికొక ట్యూబు కలిపి, తన లో వస్త్రంలో ధరించిన ప్యాడ్ లోకి పంపుతూ ఋతుస్రావంలో జరిగేలా తనపై తాను ప్రయోగించి తన పాడ్ ఏవిధంగా పని చేస్తుందో తానే స్వయంగా పరీక్షించాడు. ఆడవాళ్ళు ఆ 5 రోజులు ఎంత నరకం అనుభవిస్తారో, అది ప్రతినెల (నొప్పి సంగతి అలా ఉంచి) తానే అనుభవించి ప్రపంచంలోని మహిళల అందరికి నేను చేతులెత్తి నమస్కారం చేస్తున్నాను అన్నాడు ఒక సందర్భంలో.

తనపై చేసుకొన్న ఈ ప్రయోగంలో తన లో వస్త్రాలతో పాటు ప్యాంటు, లుంగీ కూడా రక్తంలో తడిసిపోయేవి. దుర్గంధం వచ్చేది. ఇతను చేస్తున్న చేష్టలు చుట్టుప్రక్కల వారికి తెలిసిపోయాయి. అందరూ పిచ్చివాడు, అసహ్యమైన పనులు చేస్తున్నాడు అని ఏవగించుకోవం ప్రారంభించారు.

ఈవిధంగా జరుగుతుంటే ఆనోటా, ఈ నోటా ఇతని భార్య చెవిన పడ్డాయి ఈ గుసగుసలు. ఆమె చెప్పింది "మీకెందుకు, ఎవరి ఖర్మకి వారిని వదిలెయ్యి" అని. లేదు నీకోసం, నీ కష్టం చూడలేక, నీ సంతోషానికై ఈ పని కొనసాగిస్తానని చెప్పాడు. ఆమె తన భర్తకి జరుగుతున్న అవమానం భరించలేకపోయింది. తన భర్త ఈ పాడ్ నెపంతో పరాయి ఆడవాళ్ళ వెంట పడుతున్నాడన్న పుకారు విని, ఆమె ఇతడ్ని విడిచి తన పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆమె సోదరులు విడాకులకై ప్రయత్నాలు కూడా చేశారు.

అయినా అతను తన ప్రయత్నాలు ఆపలేదు. దేశంలో అనేక కోట్ల మంది ఆడవాళ్ళకి ఈ సమస్య ఉందని తెలుసుకొని, ఇంకా తీవ్రంగా తన ప్రయత్నాలు చేయసాగాడు. తన భార్య దూరమైంది,

సొంత ఇంట్లోని మహిళలు ఇతడ్ని ఈసడించుకొన్నారు, సమాజం ఇతన్ని వెలివేసింది. అయినా అతను మాత్రం తన ప్రయత్నం మానలేదు. ఇంకా కృత నిశ్చయంతో 'ఇప్పుడు తన ప్రయత్నం కేవలం తన భార్య కోసం కాదు, మొత్తం స్త్రీ జాతి కోసం అని ద్విగుణీకృత దీక్షతో తన ప్రయాణం కొనసాగించాడు'.

ఈవిధంగా దాదాపు 2 సుదీర్ఘ సంవత్సరాలు తన ప్రయోగాలు కొనసాగించే క్రమంలో ఈ పెద్ద కంపెనీలు 'పైన్' (దేవదారు చెట్టులో ఒక రకం) చెట్టు బెరడుతో చేసిన సెల్యులస్ రూపంలో వాడతారని, ఇది తడిసినా రూపం కోల్పోదని, తడిని పీల్చుకునే గుణం కలిగినదని, కనకనే పాడ్‌లో వాడటాని ఇదే సరైన పదార్థం అని తెలుసుకొన్నాడు.

ఈ పదార్థం వాడి శానిటరీ నాప్‌కిన్ (పాడ్) లు చెయ్యటానికి కోట్ల రూపాయలు ఖరీదు చేసే విదేశీ యంత్రాలు కావలసి ఉంటుంది.

అంత డబ్బు తనవద్దకానీ, ఈ ప్యాడ్‌లు వాడే వారివద్ద కానీ లేదని గ్రహించి, ఈ పాడ్‌లు చెయ్యటానికి అందరికీ అందుబాటులో ఉండే ధరలో తానే ఒక చిన్న యంత్రాన్ని కనిపెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఎంతో శ్రమతో యంత్రాన్ని తయారు చేశాడు అరుణాచలం. ముంబయి నుంచి ఒక వ్యాపార వేత్త రూ. 75,000ల విలువగల 'పైన్' దూదిని సరఫరా చేశాడు. ఈయన 18 నెలలు కష్టపడి సానిటరీ పాడ్‌లు తయారు చెయ్యటానికని చిన్న యంత్రాన్ని తయారు చేశాడు. పెద్ద విదేశీ యంత్రాలు మూడున్నర కోట్ల రూపాయలుంటే ఈయన తయారు చేసిన చిన్న యంత్రం రూ. 68 వేలు మాత్రమే ఉంటుంది. దీనితో రోజుకి ఒకరిద్దరు మహిళలు 1500 పాడ్‌లు తయారు చేసుకోవచ్చు. సమాజానికి సేవ చేస్తూనే తాము ఆర్థికంగా మెరుగుపడే అవకాశం పొందవచ్చు. ఇదే మురుగనాథన్ అభిమతం, ఆశ. ఈయన పద్ధతులలో తయారు చేసిన పాడ్‌ల ఖరీదు రూ. 30-40 కాక, కేవలం రెండున్నర రూపాయలు మాత్రమే ఉంటాయి.

ఇప్పుడు ఈయన రూపొందించిన 'పాడ్'లు ఎన్నో దేశాలలో, మన దేశంలోని అన్ని రాష్ట్రాలలో వాడుతున్నారు. ఇతను తయారు చేసిన 'ప్యాడ్' ఏ విదేశీ కంపెనీ తయారు చేసిన ప్యాడ్‌కీ తీసిపోదని కితాబు నందుకొన్నాడు. కాలేజీలలో, పాఠశాలల్లో, కార్యాలయాల్లో, కంపెనీలలో ఎక్కడ మహిళలుంటారో అక్కడ ఈ యంత్రాలు ఏర్పాటు చేసి, బరువు చూసుకునే యంత్రాల్లా పాడ్‌లు అమ్మే యంత్రాలు ఏర్పాటు చేయబడ్డాయి.

ఈవిధంగా తన భార్య అవసరాన్ని తీరుస్తానన్న తన మాట నిలబెట్టుకోవడమే కాక, యావత్ మహిళా లోకానికి ఎంతో మేలు చేసిన వాడయ్యాడు అరుణాచలం మురుగనాథన్. అనేక మందికి ఉపాధి





కల్పించాడు. కేవలం ధనార్జన కోస వ్యాపారంలా కాక, లక్షలాది మంది మహిళలకి ఉపాధి కల్పించాలనే సేవా భావంతో ఈ పని చేశాను కొనసాగిస్తున్నాను అంటాడాయన.

ప్రపంచ మహిళలకి ఎంతో మేలు చేసిన ఈయన ఎన్నో బహుమానాలు, సన్మానాలు అందుకొన్నాడు. ఎన్ఐఎఫ్ మరియు హనీబీ వారు 2009లో 'రాష్ట్రపతి పురస్కారం' తో సత్కరించగా, టైమ్స్ పత్రిక వారు 2014లో ప్రపంచంలోని 100 మంది ముఖ్యమైన వారిలో ఒకరిగా గుర్తించింది. భారత ప్రభుత్వం 2016లో 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. 'టెడ్ టాక్' కూడా ఇచ్చారాయన. ఇప్పుడు జాతీయ స్థాయి సంస్థలైన ఐఐటి ముంబాయి, ఐఐఎం అహమ్మదాబాద్, ఐఐఎం బెంగుళూరులే కాక, హార్వర్డ్ విశ్వ విద్యా లయాల్లో కూడా తరచూ ప్రసంగిస్తుంటాడు. ఇవే కాక, వివిధ సినిమాలు, కథా చిత్రాలుగా ఈయన చరిత్ర మలచబడింది.

నేనెంత శ్రమించానో, ఎన్ని అవమానాలు భరించానో నాకే తెలుసు. కానీ, ఇప్పుడు నా ఆవిష్కరణకి ఇంత ఆదరణ రావటం, ఇన్ని కోట్ల మంది దానిని తరచూ వాడి, చాలా బాగుంది అని మెచ్చుకోవటం అన్నది నేను పొందిన బహుమానాలు, సత్కారాలన్నిటికన్నా విలువైనది అంటాడు 'పాడ్‌మాన్' అరుణాచలం మురుగనాథమ్.

ఈ మహానుభావుడి కథ ప్రతి ఇన్నోవేటర్ కథే. ఒక ఇన్నోవేషన్ చేసేటపుడు ప్రతి ఇన్నోవేటర్ పడే ఇబ్బందులు, సాధక బాధకాలు, కష్టాలు, ఈసడింపులు, అప్పుడప్పుడూ సమాజ తిరస్కరణ కూడా జరుగుతూ ఉంటాయి. ఇవన్నీ తట్టుకొని తాను ఎంచుకొన్న 'లక్ష్యం' (సమస్యా పరిష్కారం) వైపు దీక్ష, పట్టుదలతో అన్ని కష్టాలను సహించి ముందుకు సాగినపుడే విజయం లభిస్తుంది. సమాజ శ్రేయస్సు సిద్ధిస్తుంది అనటానికి ఈయన జీవిత చరిత్ర సజీవ సాక్ష్యం. ఇన్నోవేటర్లు చేసే 'సృజన'లు ఎంత ఎక్కువ మంది నిత్య జీవిత సమస్యలను పరిష్కరిస్తే, అంత ప్రాచుర్యం పొందిన 'ఇన్నోవేషన్' అవుతుంది. తద్వారా కొన్ని లక్షలు, కోట్ల మంది సమస్యలకి పరిష్కార మార్గం దొరుకుతుంది. మన మురుగనాథం చేసింది అదే కదా! ప్రతి ఇన్నోవేటరు కష్టాలు వచ్చినపుడు వెనకడుగు వేయకుండా, చేస్తున్న పని విరమించకుండా ముందుకు సాగితే తనకి, సమాజానికి, దేశానికి కూడా మేలు చేసిన వారవుతారన్న 'పల్లెసృజన' విశ్వాసానికి సజీవ సాక్ష్యం 'మురుగనాథం' కథ. భారత దేశపు యువత ఈయన కథను స్ఫూర్తిగా తీసుకొని సామాన్య ప్రజల సమస్యలకు పరిష్కారాలు వెతుకుతారని 'పల్లెసృజన' విశ్వసిస్తోంది.

# రసాయన ఎరువులు వృథా కాకుండా నేరుగా మొక్కకు అందించే పరికరం

## తల్లి కష్టాన్ని చూసి తయారు చేసిన విద్యార్థి శశిధర్



- పల్లె వీరరాఘవ రెడ్డి

రైతులు మిరప, ప్రత్తి, కూరగాయల పంటలకు రసాయన ఎరువులు వేయడం సహజం. పంక కొద్దిగా ఎదిగిన తర్వాత వాటికి పోషకాలు అందించడం కోసం రసాయన ఎరువులు వేస్తూ ఉంటారు. ఎరువును ఒక గిన్నెలో వేసుకుని ప్రతి మొక్క దగ్గర వంగి మొక్క మొదలు వద్ద వేస్తూ ఉంటారు. అలా కాకుండా నిలబడి వేసినట్లయితే ఆ ఎరువులు మొక్కల ఆకులకు తగిలి అవి మాడిపోయే ప్రమాదం ఉంటుంది. ఎందుకంటే రసాయన ఎరువులలో 'నత్రజని' ఉంటుంది కాబట్టి అది ఆకులకు తగిలిన చోట అవిమచ్చలు పడటం లేదా మాడిపోవటం జరుగుతూ ఉంటుంది. ఇలా కాకూడదు అంటే ప్రతి మొక్క వద్ద వంగి, మొక్క మొదలు వద్దనే వేయాల్సి ఉంటుంది.

ఇలా వేసినా కూడా రైతుకు నష్టమే. ఎందుకంటే ఈ రసాయన ఎరువులు గాలి లేదా సూర్యరశ్మికి కరిగిపోయి, అవిరి అయ్యే అవకాశాలు ఎక్కువ. అందువల్ల వేసిన ఎరువులు 50 శాతానికి తక్కువగానే మొక్కలకు అందే అవకాశం ఉంటుంది. మిగతాదంతా ఆవిరై పోయి వాతావరణ కాలుష్యం కూడా జరుగుతుంది.

ఈ సమస్య ఇన్నోవేటర్ శశిధర్‌ను ఒక పరికరం తయారు చేసేలా ప్రేరేపించింది. తెలంగాణ రాష్ట్రం లోని శివశంకర్ భూపాల పల్లి జిల్లా కేంద్రానికి చెందిన ఎదులాపురం ఆగాచారి, లక్ష్మిల కుమారుడు 'ఎదులాపురం శశిధర్' ప్రస్తుతం ఘట్‌కేసర్‌లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువు తున్నాడు. ఇతని తండ్రి టీవీలు రిపేరు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంటే, తల్లి తమకున్న పొలంలో వ్యవసాయ పనులను చూసుకుంటూ కుటుంబ పోషణకు సహాయపడుతూ ఉంటుంది. ఇద్దరూ కష్టపడి తమ బిడ్డ శశిధర్‌ను ఉన్నత చదువులు చదివించేందుకు కృషి చేస్తున్నారు. ఒకరోజు తన ఇలా ఎరువును తమ మిరప చెట్లకు వేయటం వల్ల ప్రతి మొక్క వద్ద వంగడంతో నడుము నొప్పితో తల్లి అలసిపోయి జ్వరంతో బాధపడటం చూసి శశిధర్ మనసు చలించింది. తన తల్లిని ఈ కష్టం నుండి ఎలాగైనా రక్షించాలి, ఈ ఎరువులు ప్రతి సంవత్సరం వేయక తప్పదు, ఇలా ఎరువులు వేసినప్పుడల్లా అలసిపోవటం చాలా బాధగా ఉంది, దీనికి పరిష్కారంగా ఒక చిన్న పరికరం ఏదైనా చేస్తే బావుంటుంది అని ఆలోచించాడు.

దాదాపు ఒక సంవత్సరం పాటు తన ఆలోచనలకు పదును పెట్టి మొత్తానికి ఒక నమూనా పరికరాన్ని తయారు చేశాడు శశిధర్. ఈ పరికరంలో 2–3 కిలోల ఎరువు నింపేలా ఒక చిన్న డబ్బాను ఏర్పాటు చేశాడు. ఒక పైపుకు పైన రెండు చేతులతో పట్టుకునేలా ఒక పిడి ఏర్పాటు చేసి, అందులో ఒక పిడికి క్రింద భాగంలో ఒక లివర్ ఏర్పాటు చేశాడు. పైపుకు క్రింది భాగం భూమి లోపలికి చొచ్చుకు పోయేలా ఒక





పదునైన చ(టం తయారు చేశాడు. ఈ పరికరాన్ని మొక్క మొదలు వద్ద భూమిలోపలికి చొప్పించి, చేతివద్ద వున్న లివర్ నొక్కిన వెంటనే మొక్కకు అవసరమైనంత ఎరువు భూమి లోపలికి వెళ్తుంది. మళ్ళీ ముందున్న మొక్క వద్ద ఎరువును వేసేటపుడు మొదట వేసిన ఎరువుపైన దాన్ని వేసే వ్యక్తి పాదంతో తొక్కడం వల్ల అక్కడ ఎరువు వేసిన రంధ్రం మట్టితో పూడుకు పోతుంది.

ఇలా జరగటం వల్ల ఎరువు ఏమాత్రం గాలి, వెలుతురుకు ఆవిరై పోకుండా వంద శాతం మొక్కకు అందటం జరుగుతుంది. అంతే కాకుండా ఈ ఎరువు వేయటానికి మనిషి ఏమాత్రం వంగి వేయవలసిన అవసరం లేకపోవటంతో ఎరువులు వేసే వ్యక్తికి నడుము నొప్పి వచ్చే అవకాశం లేదు.

ఇలా తాను తయారు చేసిన పరికరాన్ని ముందుగా తన తల్లి చేతులతోనే ప్రయోగం చేయించి, దాన్ని మరి కొంతమంది రైతులకు ఇచ్చి వాళ్ళు కూడా ప్రయోగం చేసి బావుందని కితాబు ఇవ్వటంతో ఇప్పుడు దాన్ని పూర్తి స్థాయిలో రైతుల కొరకు ఆ పరికరాలను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ పరికరం ఇనుప పైపు, కడ్డీలతో చేస్తే వెయ్యి రూపాయల లోపలే తయారు అవుతుంది. కానీ, అవి త్వరగా తుప్పు పట్టే అవకాశం ఉంటుంది. ఎందుకంటే దీన్ని కేవలం ఎరువులు వేసేటపుడే ఉపయోగిస్తారు, ఆ తరువాత దాన్ని ఒక మూలన పడేస్తారు కాబట్టి మళ్ళీ వచ్చే సంవత్సరం తీసేలోపల అది తుప్పు పట్టే ప్రమాదం






ఉండటంతో ఈ పరికరాన్ని 'స్టెయిన్‌లెస్ స్టీల్'తో తయారు చెయ్యాలి అనుకుంటున్నాడు. ఈ పరికరం తయారు చెయ్యటానికి దాదాపు 2 వేల దాకా ఖర్చయ్యే అవకాశం ఉంది.

ముఖ్యంగా చిన్న కమతాలు ఉన్న రైతులు తమ పొలంలో ఎరువులు వేయాలంటే, ట్రాక్టర్లు, ఎద్దులతో పని చేయించుకోవటం కష్టం ఎందుకంటే కమతాలు చిన్నవి కావటం వల్ల వాటితో ఎరువులు వేస్తే పంట నష్టం ఎక్కువగా జరిగే అవకాశముంటుంది. కాబట్టి రైతులు తామే స్వయంగా చేతితో వేస్తూ ఉంటారు. అటువంటి వారికి ఈ పరికరం ఎంతగానో ఉపయోగ పడుతుంది. మనిషి ఎలాంటి అలుపు పొందకుండా రోజుకు అర ఎకరం పైనే మొక్కలకు ఎరువులు వేసుకోవచ్చు.

అతి త్వరలో ఈ పరికరం అందుబాటులోకి తీసుకు రావటానికి శశిధర్ ప్రయత్నం చేస్తున్నాడు, అతని ప్రయత్నానికి 'పల్లెసృజన' అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నది. చిన్న కమతాలున్న రైతులు ఈ పరికరాన్ని ఉపయోగించి, ఎలాంటి అలసట పొందకుండా, ఎరువులు వృధా కాకుండా తమ పంటలను రక్షించుకోవాలని కోరుకుంటోంది పల్లెసృజన. ●

**ఇన్నోవేటర్ శశిధర్, ఫోన్ : 83281 63817**

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత 18 సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. అంతే కాక పునాది స్థాయి ఇన్నోవేషన్లు ఎన్నో అందుబాటులోకి రావటం, గ్రామాల్లోనే ఎంతోమందికి ఉపాధి లభించటం జరిగింది.

గత 18 యేళ్ళ ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం. ఈ ప్రయత్నంలో మీ సమస్యలను మీవద్దనుండి సేకరించాలని నిర్ణయించుకున్నాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము.

-ఎడిటర్

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866 00 1678, వీరరాఘవ రెడ్డి : 81257 99904 / 79890 38186

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## ఆరోగ్యం కోసం కొన్ని కషాయాలు



ఉమా మహేశ్వర రావు

మనం ఆరోగ్యంగా ఉండటం కోసం కొన్ని కషాయాలను వాడ గలిగితే, ఇప్పటికే ఉన్న కొన్ని రోగాలు నయం అవుతాయి. ఒకవేళ కాకున్నా, కొత్త రోగాలు మాత్రం రాకుండా జాగ్రత్త పడవచ్చు.

### గుండె జబ్బులున్న వారు:

కొందరికి గుండె జబ్బు లేకున్నా సరే అప్పుడప్పుడూ గుండె దడగా ఉండటం, గుండెల్లో ఏదో తెలియని అనిశ్చితిలా అనిపించటం తదితర కారణాల వల్ల చాలా భయపడుతూ ఉంటారు. అటువంటి వారు 'రెండు వారాలు కొత్తిమీర రసాన్ని రోజుకొక చెంచా చొప్పున తాగాలి., ఒక వారం తులసి ఆకు రసం, ఒక వారం తమలపాకు రసం' ఇలా నాలుగు వారాలు అయిన తరువాత మళ్ళీ ఇలాగే మరో నాలుగు వారాల పాటు చేయగలిగితే గుండెకు సంబంధించిన జబ్బుల నుండి బయట పడవచ్చు.

### బరువు తగ్గటానికి:

చాలా మంది బరువు తగ్గాలని ఎన్నో రకాల మందులు ఉపయోగిస్తూ ఉంటారు, మరెన్నో రకాల ఆసనాలు, మార్నింగ్ వాక్‌లు చేస్తూ ఉంటారు. అలాంటి వారు చేయవలసింది ఒక వారం పాటు రోజు విడిచి రోజు దోసకాయ తీసుకుని తోలు, విత్తనాలతో సహా ముక్కలుగా కత్తిరించి, అందులో ఒక గ్లాసు నీటిని పోసి పొయ్యిమీద పెట్టి బాగా మరగబెట్టాలి. అది చల్లారిన తరువాత ఆ నీటిని వడకట్టుకొని తాగాలి. రెండు మూడు రోజుల వ్యవధి ఇచ్చి ఆ తర్వాత ఒక గ్లాసు నీటిలో రెండు చిటికలు పసుపును వేసి, ఆ నీటిని బాగా మరగబెట్టి, చల్లారిన తర్వాత తాగాలి. తరువాతి వారం గరిక ఒక గుప్పెడు సేకరించి, రోట్లో వేసి కొద్దిగా నజిగిజిగా దంచి, అందులో ఒక గ్లాసు నీరు పోసి, పొయ్యిమీద బాగా మరిగేంత వరకు కాచి, చల్లారిన తర్వాత వడకట్టుకుని తాగాలి. తర్వాతి వారం 'ఈత ఆకులు లేదా రావి చెట్టు ఆకులు' తీసుకుని పై విధంగానే రోట్లో వేసి కొద్దిగా దంచి, గ్లాసు నీటిని కలిపి వేడి చేసి, చల్లారిన తర్వాత వడకట్టుకుని తాగాలి. తర్వాత వారం తమలపాకు రసం – దీన్ని వేడి చేయాల్సిన అవసరం లేదు, తమలపాకులను బాగా దంచి, అందులో నీటిని కలిపి రసంలాగా తయారు చేసుకుని తాగాలి. ఇక ఆఖరు వారం జీలకర్ర తీసుకుని రోట్లో వేసి మెత్తగా దంచి ఆ పొడిని నీటిలో కలుపుకుని తాగాలి. ఇలా చేయ గలిగితే ఒక నెలలో 4–5 కిలోల బరువు తగ్గుతారు. ఇవన్నీ మనకు అందుబాటులో ఉన్నవే కాబట్టి, ఏవేవో మాత్రలు వేసుకుని ఇబ్బంది పడే బదులు ఈ విధంగా చేస్తే మంచిది. ఈ విధంగా చేస్తున్నపుడు పత్యమేమీ చెయ్యవలసిన అవసరం లేదు. మామూలుగా రోజులాగే అన్నీ తింటూ కూడా ఈ కషాయాలు తీసుకోవచ్చు.

### కిడ్నీ సమస్యలకు పరిష్కారం:

ప్రస్తుతం చాలా మందిని పట్టి పీడిస్తున్నది 'కిడ్నీ సమస్య'. కిడ్నీలలో చిన్న చిన్న సమస్యలు వచ్చినపుడు వాటిని అశ్రద్ధ చేస్తే అవి పెద్ద రోగాలుగా మారే ప్రమాదముంది. రోగం ముదిరితే డయాలసిస్ వరకు వెళ్ళాల్సి వస్తుంది. ఈ సమస్య రాకుండా ఉండాలంటే నీటిని ఎక్కువగా సేవిస్తూ ఉండాలి. చలికాలం అయినా సరే నీటిటి తాగుతూ ఉండాలి. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండటం కోసం ఒక వారం 'పారిజాతం' ఆకుల కషాయం, ఒక వారం తెల్ల గంజేరు (పునర్నవ) ఆకుల కషాయం, మరొక వారం 'రణపాల' ఆకుల కషాయం, ఆఖరి వారం 'కొత్తిమీర' ఆకుల కషాయం. ఇలా నాలుగు వారాల పాటు సేవిస్తూ, వీటితో పాటు దోసకాయ కషాయం సేవిస్తే ఇంకా మంచిది. ఇలా చేయ గలిగితే కిడ్నీ సమస్యలు రావు, ఒకవేళ ఉన్నా నయమైపోతాయి.

### కంటి సమస్యలు:

'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు మనం కళ్ళను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటూ ఉండాలి. కంటి సమస్యలు ఉన్నవారు 'క్యారెట్' ఎక్కువగా వినియోగిస్తూ ఉండాలి, అది కూరల రూపంలోనైనా సరే, లేదా నేరుగానైనా సరే ఎలా తీసుకున్నా మంచిదే. ఆహారంలో పుదీనా పచ్చడి, చుక్కకూర పచ్చడి తీసుకుంటూ ఉండాలి. మునగాకు కషాయం సేవిస్తూ ఉండాలి. దానిమ్మ పండ్లు ఎక్కువగా తినాలి. పౌర్ణమికి 5 రోజులు ముందు, 5 రోజులు తర్వాత కటిక నేలమీద నిలబడి 10 నిమిషాల పాటు చంద్రుడిని చూస్తూ ఉంటే కంటికి ఎంతో మేలు జరుగుతుంది. ఇలా చేయగలిగితే కంటి సమస్యలు రావు, ఉన్నా అవన్నీ తొలగిపోయి, చూపు స్పష్టంగా ఉంటుంది.

### థైరాయిడ్ సమస్యకు పరిష్కారం:

థైరాయిడ్, ఓసిడి, ఆర్గానిక్ ఇన్‌బ్యాలెన్స్ అని ఊబకాయం పెరిగిపోయి, వేలాది రూపాయలు మందులకే వినియోగిస్తున్నారు చాలా మంది, ముఖ్యంగా స్త్రీలు ఈ సమస్యలు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. థైరాయిడ్ నివారణకు 'మారేడు' ఆకులు తీసుకుని (శివాలయంలో పూజ చేసిన తర్వాత ఆకులను కూడా వాడొచ్చు), కానుగ ఆకు, మునగ ఆకు, చింతాకు, తమలపాకుల కషాయాలను రోజుకొకటి చొప్పున 5 రోజుల పాటు తీసుకోవాలి. ఇలా మండలం రోజులు (40 రోజులు) సేవించ గలిగినట్లయితే థైరాయిడ్ సమస్యల నుంచి సులభంగా బయట పడవచ్చు.

### రక్తపోటు (బిపి) సమస్య నివారణకు:

చాలా మంది ఎన్ని మందులు వాడినా బిపి కంట్రోల్ కావడం లేదు, 300 – 500 ఉంటోంది అని భయపడిపోతూ ఉంటారు. ఈ సమస్య ఉన్నవారు ఆయుర్వేద దుకాణాల్లో 'సర్పగంధ' అనే మాత్రలు లభిస్తాయి. ఈ ఔషధం ఒక చెట్టు వేరు నుంచి తయారు చేస్తారు. వాటిని తెచ్చుకొని మీరు బిపి కొరకు ఏ మాత్రలు వేసుకుంటూ ఉన్నా సరే, వాటితో పాటు ఈ సర్పగంధ మాత్ర ఒకటి వేసుకుంటూ ఉన్నట్లయితే రక్తపోటు ఎప్పుడూ నియంత్రణలో ఉంటుంది. వీరు కూడా 'మారేడు, తులసి, కొత్తిమీర' కషాయాలను రెండు రోజుల వ్యవధిలో ఒక్కో కషాయం సేవిస్తూ ఉన్నట్లయితే బిపి సమస్య నుంచి బయట పడవచ్చు.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

# ప్రకృతిలో లభించే మొక్కలతో వైద్య చిట్కాలు

ప్రస్తుతం మళ్ళీ కరోనా కలకలం రేపుతోంది కాబట్టి ప్రతి ఒక్కరూ తమ ఒంట్లో రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) పెంచుకోవటం ఆరోగ్యానికి మంచిది. శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచుకోవటానికి కొన్ని చిట్కాలు ఇక్కడ వివరిస్తున్నారు కొమెర జాజి.

శరీరంలో రోగనిరోధక శక్తి పెంచుకోవటానికి శుద్ధి చేసిన అశ్వగంధ చాలా మంచి ఫలితాలను ఇస్తుంది. దీన్ని శుద్ధి చేయటానికి అశ్వగంధ దుంపను తీసుకుని రాత్రిపూట స్వచ్ఛమైన దేశీ ఆవు పాలలో నానబెట్టాలి. ఉదయమే దాన్ని తీసి, ఆవు పాలను పారవేసి, దుంపను నీడలో ఆరబెట్టాలి. మళ్ళీ రాత్రికి కూడా అలాగే చెయ్యాలి. ఇలా మూడు రాత్రుళ్లు అశ్వగంధ దుంపను ఆవు పాలలో నానబెట్టి నీడలో ఆరబెట్టినట్లయితే అది శుద్ధి అవుతుంది. దుంప బాగా ఆరిన తర్వాత రోట్లో వేసి మెత్తటి పొడిగా చెయ్యాలి. ఆ తర్వాత 'తిప్పతీగ, శొంఠి, ఉసిరి కాయ బద్దలు (విత్తనాలు లేకుండా), ఏనుగు పల్లేరు కాయలు' వీటన్నిటినీ తీసుకుని, నీడలో ఆరబెట్టి ఆ తర్వాత పెనంపైన కొద్దిగా వేయించి పొడి చేసుకోవాలి. ఆ తరువాత ఈ పొడులన్నిటినీ కలిపి ఒక సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ ఒకటి లేదా రెండుసార్లు ఒక గ్లాసు వెచ్చటి నీటిలో ఒక చెంచాడు ఈ పొడిని కలుపుకని తాగినట్లయితే శరీరంలో రోగనిరోధక శక్తి చాలా బాగా వృద్ధి చెందుతుంది. పైన చెప్పిన మూలికలన్నీ నేరుగా పొందలేని వారు సమీప పట్టణాల్లోని ఆయుర్వేద మూలికలు అమ్మే దుకాణాల్లో కూడా ఇవన్నీ లభిస్తాయి కాబట్టి వాటిని తెచ్చుకొని పైవిధంగా చేసుకోవచ్చు.

ఈ రోగ నిరోధక శక్తిని పెంచుకోవటానికి మరో మార్గం – అర గ్లాసు నీటిలో రెండు చెంచాల తేనె, ఒక చెంచాడు అశ్వగంధపు పొడి, ఒక స్పూను 'మగసిరి గడ్డల' పొడి కలిపి రోజూ ఉదయం తీసుకున్నట్లయితే శరీరంలో రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చు.

అరచేతిలో తేనె కొద్దిగా వేసుకుని, అందులో తిప్పతీగ పొడిని కొద్దిగా కలిపి రంగరించి, ప్రతిరోజూ నోట్లోకి తీసుకున్నట్లయితే కూడా శరీరంలో రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. ఇది గుండెకు కూడా చాలా బలాన్ని అందిస్తుంది.

శరీరానికి ఎక్కడైనా దెబ్బలు తగిలినట్లయితే చలికాలంలో కొందరికి పుండ్లు త్వరగా మానవు. పుండ్లు చీము కారుతున్నా సరే అటువంటి వారు గుమ్మడికాయ కండను తీసుకుని, చేతితో మెత్తగా పిసికి, అందులో కొద్దిగా పసుపు వేసి, రంగరించి, పుండుపైన లేపనంగా పూసినట్లయితే పుండు త్వరగా మానటంతో పాటు, నొప్పులు కూడా తగ్గుతాయి.

కొందరికి రాత్రుళ్లు నిద్రపట్టక సతమతం అవుతూ ఉంటారు.



తిప్పతీగ

అటువంటి వారు బూడిద గుమ్మడికాయ గింజలను తీసుకుని, రోట్లో వేసి బాగా దంచినట్లయితే అందులోనుండి తైలం వస్తుంది. ఆ తైలం ఒక్క 10 గ్రాములు తీసుకుని, తలకు పట్టించి బాగా మర్దనా చేసి పడుకుంటే సుఖ నిద్ర పడుతుంది.



'వైద్య' కొమెర జాజి

ఈ చలికాలం కొందరికి ఒళ్ళు వేడి చేసి, విష జ్వరాలు వస్తూ ఉంటాయి. అటువంటి వారు 'కరక్కాయ' ను తీసుకుని దాని గుజ్జును పెనంపైన కొద్దిగా దోరగా వేయించి, రోట్లో వేసి దంచి చూర్ణం తయారు చేసి ఉంచుకుని, అందులో కొద్దిగా పసుపు వేసి, ఈ మిశ్రమాన్ని 3 గ్రా తీసుకుని, అందులో 10 గ్రా. తేనె కలుపుకుని రోజుకు మూడుసార్లు నోట్లోకి తీసుకున్నట్లయితే విష జ్వరం త్వరగా నయం అవుతుంది.

కొందరికి దగ్గు వచ్చినపుడు అందులో నుండి రక్తం పడుతూ ఉంటుంది. అటువంటి వారు 'కలబంద' గుజ్జు 20 గ్రాములు తీసుకుని, అందులో చిటికెడు మిరియాల పొడి తీసుకుని రెండింటినీ దేశీ ఆవు పాలు ఒక గ్లాసు తీసుకుని, అందులో తగినంతగా తాటిబెల్లం వేసి మిశ్రమం చేసిన పాలను తీసుకుంటూ ఉన్నట్లయితే దగ్గులో వచ్చే రక్తస్రావం ఆగిపోతుంది.

విపరీతమైన తలనొప్పితో బాధపడే వారు 'గుంట గలగర' ఆకులను సేకరించి, వాటిని రోట్లో వేసి మెత్తగా నూరి, రసం తీయాలి. ఆ తర్వాత కొద్దిగా బియ్యం, కొద్దిగా మిరియాలు కలిపి రోట్లో వేసి మెత్తటి పొడిగా చేసుకోవాలి. ఈ పొడిని ముందుగా తీసి ఉంచుకున్న గుంట గలగర ఆకుల రసంలో కలిపి మళ్లీ రోట్లో వేసి నూరినట్లయితే ఇదంతా ఒక పేస్టులా తయారవుతుంది. ఆ పేస్టు తీసుకుని, తల పైన నొసటి భాగంలో ఉదయం పూట పట్టీలాగా వేసుకోవాలి. రాత్రిపూట కొద్దిగా ఆవు నెయ్యి, అందులో రెండు చుక్కల పిప్పింటాకు రసం కలిపి పడుకునే ముందు ముక్కులో వేసుకుంటూ ఉండాలి. ఇలా ఒక్క వారం రోజుల పాటు చేసినట్లయితే విపరీతమైన తలనొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు.

పిప్పింటాకు రసాన్ని పెనంపైన వేసి, కొద్దిగా గోరువెచ్చగా అయిన తర్వాత తీసుకుని, తలపైన నొసటికి పూసినా కూడా తలనొప్పి చాలా వరకు తగ్గిపోతుంది.

ఊబ కాయం ఉన్నవారు తమ బొజ్జను తగ్గించుకోవానికి 'రేల చెట్టు' లేత ఆకులను తీసుకుని, వాటిని ఒక బిందెడు నీటిలో వేసి, దానిపైన మూత పెట్టి ఆవిరి బయటికి పోకుండా చేసి బాగా ఉడికించాలి. ఆ తర్వాత ఆ బిందెను ఒక మంచం క్రింద ఉంచి, మంచం పైన వ్యక్తి బోర్లా పడుకుని, బిందెపైనున్న మూతను తొలగించి, అందులో నుంచి వచ్చే ఆవిరి పొట్టకు బాగా తగిలేటట్లు చేయాలి. ఆ తర్వాత రేల చెట్టు పూతను ఏదైనా సరే కూరలో కొద్దిగా వేసి ఆహారంగా తీసుకుంటూ ఉన్నట్లయితే బొద్దుచుట్టూ ఉన్న కొవ్వు కరిగి పొట్ట తగ్గిపోతుంది.

●


**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700

# 'తుత్తురు బెండ' మొక్కతో ఆరోగ్య ప్రయోజనాలు

'తుత్తురు బెండ' మొక్కను కొన్ని చోట్ల అడవి బెండ అని, మరికొన్ని చోట్ల దువ్వెన చెట్టు అని పిలుస్తారు. ఇది 'బల' జాతి మొక్క దీన్ని బలానికి ఉపయోగిస్తారు. ఈ మొక్క సమూలంగా ఔషధ గుణాలు కలది. పసుపు రంగు పూలను కలిగిన ఈ మొక్క పొలం గట్లవెంట, బీడు భూముల్లో విస్తారంగా లభిస్తుంది. దీని ఆకులు 'నూగు' కలిగి ఉంటాయి. ఈ చెట్లను చేతితో తాకినపుడు కొద్దిగా దురద కలిగిస్తుంది. దీని కాయలు దువ్వెన ఆకారం కలిగి ఉంటాయి. బెండకాయను ముక్కలుగా కోస్తే ఎలా ఉంటుందో ఆ విధంగా ఉంటాయి దీని కాయలు. అందుకే దీన్ని అడవి బెండ అని అంటారు. ఈ మొక్కలో అనేక ఔషధ గుణాలు కలిగి ఉన్నాయి. ఈ మొక్క వేర్లు, ఆకులు, కాయలు ఔషధాలలో ఉపయోగిస్తారు.

అడవి బెండ కాయలలోని విత్తనాలను సేకరించి, పాలలో కలిపి తాగినట్లయితే శరీర పుష్టి కలిగి బలం పెరుగుతుంది. దీని ఆకులను నాలుగైదు తీసుకుని, ఒక గ్లాసు నీటిలో వేసి పొయ్యిమీద పెట్టి బాగా మరిగించిన తర్వాత ఆ నీటిని వడబోసి ఉదయం పరగడుపుననే తాగినట్లయితే శరీరంలోని నొప్పులు చాలావరకు తగ్గుతాయి. కొన్ని రోజుల పాటు ఈ విధంగా చేసినట్లయితే ఒంటినొప్పులు నివారించ బడతాయి.






బాల నర్సయ్య, నల్గొండ జిల్లా

ఈ మొక్క వేర్లను సేకరించి, ఎండ తగలకుండా నీడలో ఆరబెట్టి, అవి బాగా ఎండిపోయిన తర్వాత పొడిగా చేసుకుని ప్రతిరోజూ ఒక గ్లాసు పాలలో అర చెంచాడు పొడిని వేసుకుని తాగినట్లయితే శరీరానికి మంచి బలం చేకూరు తుంది.

ఈ మొక్క వేర్లు బాగా ఎండిన తర్వాత వాటిని మనం పళ్లలో కుచ్చుకునే పుల్లల్లాగా ఒక కట్ట కట్టి, ఆ వేరు పుల్లల కట్టను ఒక గ్లాసులో కొన్ని పాలను తీసుకుని, అందులో ఈ పుల్లల కట్టను తిప్పుతూ ఉన్నట్లయితే, కొద్ది సేపటికి పాలలోని నీరంతా ఇంకి పోయి, పాలు గట్టిగా జున్నులాగా, పొడిగా మారిపోతాయి. ఆ పొడిని మళ్ళీ పాలలో కలిపి తీసుకున్నా కూడా ఒంటికి మంచి బలాన్ని ఇస్తుంది.

ఈ మొక్క స్త్రీల యొక్క ఆరోగ్య సమస్యలకు కూడా బాగా ఉపయోగ పడుతుంది. పైన చెప్పినట్లుగా ఈ మొక్క వేర్ల పొడిని పాలలో కలిపి మహిళలు తీసుకున్నట్లయితే వారికి కలిగి గర్భాశయ వ్యాధులు, తెల్లబట్ట, ఋతుస్రావ సమస్యలు చాలా వరకు తీరిపోతాయి.

కొందరు మహిళలు 'తెల్లబట్ట' బహిష్టుతో చాలా ఇబ్బందులు పడుతూ ఉంటారు. అలాంటి వారు చాలా నీరసంగా అయిపోతారు. అటువంటి వారు అడవి బెండ మొక్క వేర్లను, తెల్ల గంజేరు మొక్క వేర్లను సేకరించి, వాటిని నీటిలో బాగా కడిగి, నీడలో ఆరబెట్టాలి. బాగా ఎండిన తరువాత వాటిని మెత్తటి పొడిగా చేసుకోవాలి. ఆయుర్వేద దుకాణాల్లో శతావరి, అశ్వగంధ పొడులు లభిస్తాయి వాటిని తెచ్చుకొని, ఈ నాలుగు పొడులను సమానంగా 50/100 గ్రా.ల చొప్పున తీసుకుని అన్నింటిని బాగా కలగలిపి ఒక సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం భోజనం తర్వాత బియ్యం కడిగిన నీటిలో ఒక స్పూను ఈ మిశ్రమ పొడిని కలుపుకుని 4 నుండి 10 రోజుల పాటు సేవించినట్లైతే 'తెల్లబట్ట' వ్యాధి నుండి విముక్తి పొందవచ్చు.

ఇది సహజసిద్ధమైన ఔషధ గుణాలు కలిగినటువంటి మొక్క దీన్ని ఉపయోగించటం వల్ల ఏ విధమైన ఇతర సమస్యలు రావు. కాబట్టి ఎటువంటి సందేహం లేకుండా ఈ 'తుత్తురు బెండ' మొక్క లోని ఔషధ గుణాలను తెలుసుకుని, సేవించి, మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

ఈ 'బల' జాతి లోనే మరో రెండు మొక్కలు కూడా ఉన్నాయి. ఈ మొక్క 'బల' అయితే, అవి 'అతి బల', 'మహాబల' అని మొత్తం మూడు రకాల మొక్కలు ఉంటాయి. ఈ 'బల' మొక్కలో ఎటువంటి ఔషధ గుణాలున్నాయో అలాగే మిగతా రెండు రకాల మొక్కలలో కూడా శరీరానికి మంచి బలాన్ని కలిగించే ఔషధ గుణాలు కలిగి ఉన్నాయి. వచ్చే సంచికలలో వాటిని గురించి కూడా తెలుసుకుందాం.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' బాల నర్సయ్య, ఫోన్ నెం.: 6303903400**

**రాఘవరెడ్డి గారికి,**

ఎన్నో సంవత్సరాలుగా కర్నాటక మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు చెందిన 'పట్టు రైతుల సదస్సులు' నిర్వహిస్తున్న సమయంలో వారితో మేము అడిగే మొదటి కోరిక "మాకు పట్టు పురుగులకు మేత వేయటానికి 'మల్బరీ' ఆకులకు కోయటానికి అయ్యే కూలీల ఖర్చు విపరీతంగా పెరుగుతోంది, ఎలాగో అలా ఖర్చు పెట్టుకుందామని అనుకున్నా, అవసరమైన కూలీలు దొరకటం లేదు. కొడవళ్లతో కత్తిరింపులు చేస్తూ నష్టపోతున్న సమయంలో 'బ్రష్ కట్టర్' వచ్చి కొంత ఉపశమనం కలిగించింది. ఆ పని చేయటానికి కూడా బ్రష్ కట్టర్‌ను నడిపించే కూలీలు లభించటం కష్టంగా ఉంది, లభించినా వారు కూలీ విపరీతంగా అడుగుతున్నారు. అందుకు కారణం బ్రష్ కట్టర్ చేసే శబ్దానికి, కుదుపులకు దాన్ని నడిపే వ్యక్తి చాలా త్వరగా అలసిపోతాడు. ఒక రోజంతా కష్టపడినా ఒక్క ఎకరం కూడా కోత కోయలేడు" అని సంబంధిత శాఖలతో ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా, మీ కోరిక తీర్చే యంత్రం తయారు చెయ్యటానికి మావంతు ప్రయత్నాలు చేస్తున్నామని ఎప్పటికప్పుడు ఏవో మాయ మాటలు చెప్పి మమ్మల్ని మైమరపిస్తున్నారే తప్ప పట్టు రైతులను ఎవ్వరూ ఈ ఖర్చులు, శ్రమ నుండి ఆదుకోలేదు. ఇటువంటి పరిస్థితుల్లో 'ప్రవీణ్ కుమార్' చేసిన ఇన్నోవేషన్‌ను మాకు తెలియజేసి మీరు పుణ్యం కట్టుకున్నారు. ఈ యంత్రం మా కష్టాలను, నష్టాలను చాలా వరకు తీరుస్తుంది. ఇంత మంచి ఇన్నోవేటర్‌ను మా రైతాంగానికి అందించిన 'పల్లెసృజన'కు సదా కృతజ్ఞులం. ఈ యంత్రంతో దేశంలోని మొత్తం పట్టు పరిశ్రమలో విప్లవాత్మక మార్పుల తీసుకు వస్తుందని, రైతుల పెట్టుబడులు తగ్గేలా ఇలాంటివి ఇంకా ఎన్నో ఇన్నోవేషన్లు మీ ద్వారా వెలుగులోకి రావాలని మనసారా కోరుకుంటున్నాము.

**– శంకర రెడ్డి, చంద్రప్ప గౌడ (ఫోన్ : ),** రైతులు, పలమనేరు, చిత్తూరు జిల్లా.

**పలమనేరు రైతు సోదరులకు ధన్యవాదములు,**

'పల్లెసృజన' ఇన్నోవేటర్ 'ప్రవీణ్ కుమార్' ను సిరిసిల్ల ప్రాంతం లోని పట్టు రైతులు ఇతని సృజనాత్మక ఆలోచనను తెలుసుకొని, అతన్ని వారు కోరగా మల్బరీ కొమ్మలను కోత కోసే ట్రాక్టర్ అనుసంధాన పరికరం తయారు చేశాడు. ఈ పరికరం మీ ప్రాంతం వారికి ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని మేము మీ ప్రాంతానికి చెందిన మా ఇన్నోవేటర్ 'గురుమూర్తి శెట్టి'ని సంప్రదించి, ఇన్నోవేటర్‌ను అతని వద్దకు పంపడం జరిగింది. మేము ఊహించినట్లుగానే మీరు ఇతని ఇన్నోవేషన్‌ను ఆదరించి, దాన్ని అభివృద్ధి చేయటానికి మీరు మరిన్ని సూచనలు అందించారు. ఆ సూచనలను మనస్ఫూర్తిగా స్వీకరించిన ప్రవీణ్ కుమార్ వెంటనే ఆచరణలో పెట్టి మీరు కోరుకున్న పరికరాన్ని తయారు చేయటం జరిగింది. ఇటువంటి సూచనలు, సలహాలు, సమస్యలను 'పల్లెసృజన' ఎప్పుడూ ఆహ్వానిస్తునే ఉంది. ఈ యంత్రం ద్వారా మీకు ఎంతో లాభం చేకూరినందుకు మాకెంతో ఆనందంగా ఉంది. ఇలాంటి 'పునాది స్థాయి ఇన్నోవేషన్లు' (గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్) ప్రోత్సహిస్తున్న రైతాంగానికి ధన్యవాదములు. ఈ విషయంలో పూర్తి వివరాలకి ఇదే సంచికలోని కథనాన్ని చూడగలరు.

**– వీరరాఘవ రెడ్డి,** పల్లెసృజన

**వీరరాఘవ రెడ్డి గారికి,**

మీరు, మరి కొంతమంది ప్రకృతి వ్యవసాయ సలహాదారుల సలహాలకు ప్రేరేపితుడనై నేను ఈ సంవత్సరం 10 ఎకరాల్లో 'దేశీ విత్తనాలతో కూరగాయలు' పండించాలని అనుకున్నపుడు మొట్టమొదట గుర్తుకు వచ్చి మిమ్మల్నే సంప్రదించాలి అనిపించింది. ఇన్ని రకాల దేశీ కూరగాయల విత్తనాలను ఎలా సేకరించాలి అని మథన పడుతున్న నాకు 'గుంటూరుకు చెందిన నాగేశ్వర రావు' గారిని పరిచయం చెయ్యటం ద్వారా వారి వద్ద నుండి 32 రకాల దేశీ కూరగాయల విత్తనాల తెప్పించుకొని సాగుకు ఉపక్రమిస్తున్నాము. ఎలా సేకరించాలన్న మా సమస్యను ఒక్క ఫోన్ కాల్‌తో తీర్చిన మీ 'మాట సాయానికి' కృతజ్ఞులం.

**– శివరామ ప్రసాద్,** నందిగామ, ఎన్.టి.ఆర్. కృష్ణా జిల్లా.

**శివరామ ప్రసాద్ గారు,**

రైతుకు రైతును తోడు చేయటం ద్వారా ఎన్నో సమస్యలు సులభంగా తీరటమే కాదు, ఖర్చులు కూడా కలిసి వస్తాయని 'పల్లెసృజన' ఎప్పటి నుంచో ప్రగాఢంగా నమ్ముతోంది, చెబుతోంది. అటు విత్తనాలు సేకరించి, అందుబాటులో ఉంచుకున్న వారు, ఇటు విత్తనాలు అవసరమైన వారు ఇద్దరూ 'పల్లెసృజన'ను అభిమానించే వారే కాబట్టి మిమ్మల్ని ఇద్దరినీ పరిచయం చెయ్యటం వల్ల మీ అవసరం సులభంగా తీరింది. ఎంతో కష్టపడి అన్ని రకాల విత్తనాలను సేకరించి, వాటిని ఎలా మార్కెట్ చేసుకోవాలా అని మథనపడే నాగేశ్వర రావు (93915 64463) గారి లాంటి వారికి, ఒక మంచి వేదిక 'పల్లెసృజన' కలిగించింది అని నమ్మిన మీ ఉభయులకు కృతజ్ఞతలు. సమాజంలోని అందరూ ఇలా ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకునే ధోరణి అవలంభిస్తే ఇంకా ఎన్నో అద్భుతాలు మనమందరం సాధించ గలమన్న పల్లెసృజన విశ్వాసాన్ని మీరిద్దరూ నిరూపించారు. మీలాగే అందరూ పల్లెసృజన చూపించే మార్గంలోనే ఉభయ తారకంగా వ్యవహరించాలని పాఠకులను కోరుకుంటూ ధన్యవాదములు.

**– వీరరాఘవ రెడ్డి,** పల్లెసృజన.

**వీరరాఘవ రెడ్డి గారికి,**

నమస్కారములు. ఇటీవల నేను కొన్ని వాట్స్‌యాప్ గ్రూపుల్లో చూసిన 'విత్తనపు గొర్రు'ను మీకు పంపుతున్నాను. ఇది 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు తయారు చేసిందేనా? దీని ఖరీదు ఎంతో? దీంతో ఏయే విత్తనాలు విత్తుకోవచ్చు? దయచేసి తెలియజేయ గలరు.

**– విజయ భాస్కర రెడ్డి,** తాడిపత్రి

**విజయ భాస్కర రెడ్డి గారికి,**

మీరు చూసిన విత్తనపు గొర్రును 'మహారాష్ట్ర'కు చెందిన ఒక సంస్థ తయారు చేసి విక్రయిస్తోంది. దాన్ని మేము కూడా చూడటం జరిగింది. దాని గురించిన పూర్తి సమాచారాన్ని సేకరించాము. అది కొన్ని కూరగాయల విత్తనాలు (ఉల్లి లాంటి సన్నటి పరిమాణంలో ఉన్నవి) వేయటానికి మాత్రమే పనికి వచ్చేలా తయారు చేశారు, ఒక మనిషి లాగుతూ వెళ్తుంటే విత్తనాలు వాటంతట అవే సమాన దూరంలో విత్తుకోబడి మొలకెత్తటం ద్వారా గాలి, వెలుతురు బాగా మొక్కలకు లభించి అధిక దిగుబడి కూడా వస్తుందని తెలిసింది. కానీ, మన తెలుగు రాష్ట్రాల రైతాంగానికి అంతకు మించిన పనితనం చేసేదిగా ఉండాలన్నది మా ఉద్దేశ్యం. పైగా దాని ఖరీదు కూడా చాలా ఎక్కువగా చెబుతున్నారు. కాబట్టి మేము మన ఇన్నోవేటర్లకు ఆ గొర్రును చూపించి, దాన్ని మన తెలుగు రైతాంగానికి అనువుగా, అన్ని రకాల విత్తనాలు వేసుకునేందుకు వీలుగా, మనిషి, ఎద్దులు, మోటార్ సైకిల్, వీడర్ లతో లాగేందుకు అనువుగా తయారు చెయ్యమని, ఖరీదు కూడా రైతుకు అందుబాటులో ఉండేలా చూడమని కోరటం జరిగింది. అందరికీ అనువుగా ఉండే పరిష్కారం లభించినపుడు 'పల్లెసృజన' మీకు పూర్తి వివరాలను తెలియజేస్తుంది. ఏదియేమైనా మీ సమస్యను మాకు తెలియజేసినందుకు కృతజ్ఞతలు.

**– వీరరాఘవ రెడ్డి,** పల్లెసృజన

# మొక్కల ఎదుగుదల - అడవి పందుల నుండి రక్షణ

## రెండింటికీ ఒకే సేంద్రియ మందు



ఇన్నోవేటర్
**తుల్లూరి నర్సింహారావు**
ఖమ్మం జిల్లా, తెలంగాణ.

- కొండ ప్రాంతాల్లోని పొలాల్లో పంటలకు అడవి పందుల వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుంది.
- ఒక్కోసారి పంటలపై ఎంత మోతాదులో ఎరువులు, ఎన్ని రకాల మందులు పిచికారి చేసినా మొక్కల్లో ఎదుగుదల కనిపించదు.
- ఈ రెండు పనులను ఏక కాలంలో చేసే అద్భుత సేంద్రియ పురుగు మందు.
- కేవలం మూలికలతో తయారైన ద్రావణం కాబట్టి పంటలకు, మనుషులకు ఎటువంటి కీడు జరగదు.
- పంట ఎదుగుదలతో పాటు, అధిక పూత, దిగుబడి వచ్చేలా కూడా చేస్తుంది.
- పంటపై రెండు మూడుసార్లు పిచికారి చేస్తే చాలు, అడవి పందులు అటువైపు కూడా రావు. వచ్చినా, మందు ప్రభావం వల్ల పంటను కనీసం తాకవు.
- ఈ ద్రావణాన్ని ఉపయోగించిన రైతులు చాలా బాగా పని చేస్తోంది అని కితాబు ఇచ్చారు.
- ఏ పంటపైన అయినా ఉపయోగించుకోవచ్చు.
- కొన్ని ప్రాంతాల్లో పంటలపై జింకలు, కోతులు కూడా దాడులు చేస్తున్నాయన్న రైతుల కోరిక మేరకు వాటి నుండి రక్షణకు ప్రయోగాలు జరుగుతున్నాయి.











# సులువుగా మోటార్ 'ఆన్' 'ఆఫ్' చేసే రిమోట్



ఇన్నోవేటర్
**వెల్లె శ్రీనివాస్**
మహబూబాబాద్ జిల్లా, తెలంగాణ.

- వర్షాకాలంలో స్టార్టర్‌పైన వద్ద తడి ఆరనప్పుడు మోటార్‌ను స్టార్ట్ చెయ్యబోయి విద్యుత్ షాకు వల్ల జరిగే మరణాలకు స్వస్తి.
- రైతు మోటార్ వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా కేవలం జేబులో వున్న రిమోట్ స్విచ్ నొక్కడం ద్వారా మోటారు ఆన్ - ఆఫ్ చేసుకోవచ్చు.
- పొలానికి, మోటారుకు మధ్య దూరం ఉన్న రైతులు కరెంటు సరఫరా ఆగిపోతే, మళ్ళీ మోటారు వద్దకు వెళ్ళి దాన్ని స్టార్ట్ చేసేందుకు వెళ్ళే శ్రమ, సమయం ఆదా.
- నీరు డెలివరి పాయింట్ వద్ద నిలబడి లేదా కనవడేటట్టు ఉండి రిమోట్ నొక్కితే వెంటనే నీరు వస్తుంది అంటే మోటార్ ఆన్ అయిందని నిర్ధారణ చేసుకోవచ్చు.
- రిమోట్‌ను ఉపయోగించే రైతు మోటారు ఏదైనా రిపేరుకు గురైతే తప్ప మోటార్ వద్దకు వెళ్ళాల్సిన అవసరమే ఉండదు.
- రిమోట్ స్టార్టర్‌ను ఏర్పాటు చేసుకోవటం కూడా చాలా సులభం. గ్రామంలోని కనీస పరిజ్ఞానం వున్న ఏ ఎలక్ట్రిక్ మెకానిక్ అయినా దీన్ని అమర్చవచ్చు.
- పొలాల్లోనే తమ నివాస గృహమున్నవారు వరి మాగాణి లాంటి పంటలలకు ఇంట్లో నుండే రిమోట్ ద్వారా మోటార్ ఆన్ -ఆఫ్ చేసుకుంటూ పొలానికి నీరు పారించుకోవచ్చు
- దీన్ని ఏర్పాటు చెయ్యటానికి ఎటువంటి అదనపు ఏర్పాటుచల చేయవలసిన అవసరం లేదు.
- ఈ రిమోట్ స్టార్టర్‌ను ఎన్ని హార్స్‌పవర్‌ల మోటారుకైనా ఏర్పాటు చేసుకోవచ్చు. మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ వున్న ప్రతి మోటారుకు దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చు.
- సాధారణ రైతుకు కూడా అందుబాటు ధరలోనే లభిస్తుంది. ఎటువంటి నిర్వహణా ఖర్చు లు ఉండవు.








PALLE SRUJANA Telugu Bi-monthly November - December 2023 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే



పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

లేదా

"Phone Pe"
no 9866 00 1678

QR code for Phone Pe

### సభ్యత్వ వివరాలు (ఒక సంవత్సరానికి)

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| మామూలు పోస్టు ద్వారా | 200/- | 1000 |
| రిజిష్టరు పోస్టు ద్వారా | 320/- | 1120/- |

'గూగుల్ పే/ ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు లేదా ఈ క్యుఆర్ కోడ్ ద్వారా పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.